ఉష్ణోగ్రత (అంచనా)

26-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	26
తెనాలి	38	26
నరసరావుపేట	40	24
బాపట్ల	36	27
రెంటచింతల	41	26

ఉపాధి పనిదినాల్లో.. భారీగా కోత!

- తగ్గిన 12.70 లక్షల పనిదినాలు
- అమలు కాని రూ.307 కనీస వేతనం
- జిల్లాలో సగటు వేతనం రూ.282 మాత్రమే

ఆర్థిక సంవత్సరం	పనిదినాలు
2022-23	94,05,074
2023-24	84,76,071
2024-25	87,48,695
2025-26	74,77,946



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో 5.88 లక్షల జాబ్ కార్డులు రిజిస్ట్రేషన్ చేశారు. 4.29 లక్షల కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్క కార్మికునికి రోజుకు రూ.307గా వేతనం ప్రకటించింది. ఈ మేరకు వేతనం కార్మికులకు అందడం లేదు. ఈ నెలలో ఇప్పటి వరకు చెల్లించిన సగటు వేతనం రూ.282గా ఉంది. గతేడాది రూ.300 ప్రకటించగా రూ.222 నుంచి రూ.279 వరకు మాత్రమే చెల్లించారు. ప్రభుత్వం సూచించిన విధంగా కార్మికులకు వేతనం చెల్లించే విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పనులు గుర్తించి వాటికి అంచనా వ్యయం రూపొందించే సమయంలోనే నిర్దేశించిన వేతనం కార్మికునికి చెల్లించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ ప్రక్రియలో జరుగుతున్న లోపాల వల్ల కార్మికులు కనీస వేతనం అందక నష్టపోతున్నారు. ఉపాధి హామీ పని దినాల్లో కేంద్ర ప్రభుత్వం భారీగా కోత విధిస్తోంది. 12.70 లక్షల పనిదినాలు తగ్గించడంతో వంద రోజుల పని గ్యారెంటీకి విఘాతం కలిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లలో ఇంత తక్కువగా పనిదినాలను తగ్గించడం ఇదే ప్రథమం. ఇది ఉపాధి హామీని నిర్వీర్యం చేసేలా ఉందని గ్రామీణాభివృద్ధి కార్మికులు ఆరోపిస్తున్నారు. మళ్లీ వలసలు వెళ్లే పరిస్థితులు వస్తాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సొంత ఊరిని వదిలి.. పనుల కోసం వలసలు వెళ్లకుండా నిరోధించేందుకు మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. సొంత ఊరిలోనే పనులు కల్పించి, ఉపాధి కల్పిస్తోంది. ఇలాంటి ఉన్నతమైన పథకం ద్వారా ప్రతి ఏటా పనిదినాలు పెంచాల్సింది పోయి.. ఈ ఏడాది భారీగా ప్రభుత్వం కోత విధించింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది 12.70 లక్షల పనిదినాల కోత పడింది. దీని వల్ల పెద్ద ఎత్తున జిల్లాలో కార్మికులు ఉపాధిని కోల్పోనున్నారు. కనీస వేతనం రూ.307గా ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అంటే దాదాపు రూ.39.01 కోట్లు కార్మికులు కోల్పోనున్నారు. ఉపాధి పనిదినాల కేటాయింపులు పెంచాలని వారు కోరుతున్నారు.

లక్ష్యానికి దూరంగా పనులు

ఈ నెలలో 7,71,052 పని దినాలు లక్ష్యంగా ఉంది. ఇప్పటి వరకు 2,98,284 పని దినాలను కల్పించారు. 38.68 శాతం కూడా పనిదినాలు పూర్తి కాలేదు. ఇంకా ఐదు రోజుల్లో లక్ష్యం మేర పనిదినాలు కల్పించే పరిస్థితులు లేవనే చెప్పాలి. కార్మికులకు పనులు కల్పించడంలో ఉపాధి శాఖ క్షేత్రస్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పనుల వ్యయం అంచనా రూపొందించే సమయంలో ప్రతి కార్మికునికి రూ.307 వేతనం అందేలా ప్రణాళిక ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశించినా ప్రయోజనం కనిపించడం లేదు. ఇందుకు నిదర్శనం కార్మికునికి వేతనం రూ.282 చెల్లించడమే. అందరికి ప్రభుత్వం ప్రకటించిన వేతనం చెల్లించాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు ఉండాలి


- స్వర్ణాంధ్ర-2047 సాధన దిశగా 15 శాతం వృద్ధే ధ్యేయం
- అన్ని రంగాల వివరాలు సేకరించి కార్యచరణ సిద్ధం చేయాలి
- నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్‌పై శిక్షణలో కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర 2047కు అనుగుణంగా నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్రణాళికలను నిర్దేశిత లక్ష్యాలు, మార్గదర్శకాలు ప్రకారం సిద్ధం చేయాలని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అధికారులకు సూచించారు. ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో విజన్ యాక్షన్ ప్రణాళికపై గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ ఉద్యోగులకు(సీవీఏపీఎస్) శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 సాధన దిశగా అన్ని రంగాల్లో 15 శాతం వృద్ధి సాధించే లక్ష్యంతో రానున్న ఐదేళ్లలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో విజన్ యాక్షన్ ప్లాన్ రూపొందించామన్నారు. దీనికి అనుగుణంగా నియోజకవర్గ స్థాయిలో స్థానిక ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ వీఏపీలను రూపొందించాలన్నారు. స్థానిక అవసరాలు, పరిస్థితులకు అనుగుణంగా ఆర్థిక వృద్ధి సాధించేందుకు అవకాశం ఉన్న రంగాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై పూర్తిస్థాయి వివరాలతో కార్యచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని రంగాల వివరాలను సేకరించి క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా వృద్ధికి అవకాశం ఉన్న రంగాల్లో నూతన ప్రాజెక్టులు ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్‌తో పాటు సక్రమంగా అవి అమలయ్యేందుకు ఉన్న అవకాశాలను కూడా తెలియజేయాలన్నారు. వీఏపీని రూపకల్పనపై ప్రణాళిక విభాగం డైరెక్టర్ రాంబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీవో శేషశ్రీ, ప్రణాళిక విభాగం సలహాదారు సీతాపతి పాల్గొన్నారు.



శిక్షణలో ప్రసంగిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

నిరీక్షణకు తెర



- స్పౌజ్ కోటా పింఛన్లకు ఆమోదం
- మూడు జిల్లాల్లో 10 వేల మందికి ఛాన్స్
- 2023-2024 మధ్య మృతుల కుటుంబాలకు అవకాశం
- 30వ తేదీ లోగా దరఖాస్తు.. మే నెల నుంచి పింఛన్
- ఏళ్లుగా ఎదురు చూస్తున్న లబ్ధిదారుల్లో హర్షం

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కొత్తగా పింఛన్లకు దరఖాస్తు చేసుకునేందుకు ఎదురు చూస్తున్న వారికి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. కొత్త పింఛన్ల మంజూరు విషయంలో తొలి విడతగా స్పౌజ్ కోటా పింఛన్లకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇప్పటికే ఈ విధానం కొనసాగుతున్నా అది 2024 అక్టోబరు తర్వాత చనిపోయిన వారికి మాత్రమే వర్తిస్తోంది. అంతకు ముందు చనిపోయిన వారికి వర్తించడం లేదు. ప్రభుత్వం తాజాగా అలాంటి వారికి కూడా అవకాశం కల్పించేందుకు సిద్ధమైంది. తాజాగా అవకాశం కల్పించిన స్పౌజ్ కోటా పింఛన్ల దరఖాస్తులకు ప్రభుత్వం లిమిటేషన్ విధించింది. 2023 డిసెంబరు నుంచి 2024 అక్టోబరు మధ్య చనిపోయిన పింఛనుదారు కుటుంబీకులకు మాత్రమే ప్రస్తుతం స్పౌజ్ కోటాలో పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. ఈ లెక్కన గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 10 వేల మంది పింఛన్లకు అర్హులవుతారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ప్రభుత్వం నిర్ణీత కాలంలో చనిపోయిన వారికే దరఖాస్తు అవకాశాన్ని కల్పించడంపై అర్హులై ఉండి పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న అనేక మంది పెదవి విరుస్తున్నారు. 2023 డిసెంబరుకు ముందు చనిపోయినవారి పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

నిబంధనల పేరిట గతంలో వడపోత..

గత వైసీపీ ప్రభుత్వంలో నిబంధనల పేరుతో వడపోత పోసి వేలాది మందిని అనర్హులుగా ప్రకటించింది. ఇంటిస్థలం ఎక్కువ ఉందని, 300 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగం ఉందని, నాలుగు చక్రాల వాహనం ఉందని, ఇన్‌కమ్‌టాక్స్ చెల్లించారని, కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉన్నాడని, సవాలక్ష కారణాలు చూసి ఉమ్మడి గుంటూరు జిల్లాలో రెండు విడతలుగా 65 వేల మందిని అనర్హులుగా ప్రకటించి వారికి పింఛను ఎగ్గొట్టింది. ఈ ప్రక్రియను నిరంతరాయంగా కొనసాగిస్తూ అనేక మందికి పింఛను ఆపేసింది. గత ప్రభుత్వ హయాంలో పింఛనుదారు మరణిస్తే దాన్ని కుటుంబ సభ్యులకు వర్తింపజేయలేదు. దీంతో వారు కూడా పింఛన్ల కోసం నిరీక్షించేవారి జాబితాలోనే ఉన్నారు. ఇప్పుడు వారంతా పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. అయితే ప్రభుత్వం ఈ విషయంలో ఆచి తూచి స్పందిస్తోంది. ప్రస్తుతం ఉన్న అనర్హులను ఏరివేస్తూ, వారి స్థానంలో అర్హులైన వారికి అవకాశం కల్పిస్తోంది. ఆ క్రమంలో తొలివిడతగా స్పౌజ్ కోటా పింఛన్లకు అవకాశం కల్పించింది.

దరఖాస్తు ఇలా..

స్పౌజ్ కోటాలో పింఛనుకు దరఖాస్తు చేసుకోవాలనుకునే అర్హులైన లబ్ధిదారులు గ్రామ, వార్డు సచివాలయానికి వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలి. భార్యా భర్త ఇద్దరూ హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో నమోదై ఉండాలి. ఒకే రేషన్ కార్డులో పేర్లు ఉండాలి. భర్త చనిపోయినట్లు డెత్ సర్టిఫికెట్ ఉండాలి. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు ఆధార్ కార్డు కూడా తీసుకుని సచివాలయానికి వెళితే డిజిటల్ అసిస్టెంట్ ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేస్తారు. స్పౌజ్ కేటగిరిలో పింఛన్‌కు దరఖాస్తు చేసుకునేవారు అర్హులైనప్పటికీ హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో ఒకే ఇంట్లో లేకుండా ఉంటే వారు ఈ కోటా కింద అనర్హులు అవుతారు. వారు జనరల్ కోటాలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

మోదీకి మహిళలతో స్వాగతం

- సుమారు కిలోమీటర్ పొడవునా రోడ్డు షో
- రూట్‌మ్యాప్‌ని పరిశీలించిన కలెక్టర్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పునఃశంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు శుక్రవారం (మే 2) రానున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మహిళలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలకనున్నారు. ప్రధాని హెలికాప్టర్ ల్యాండింగ్ అయ్యే హెలిప్యాడ్ వద్ద నుంచి సుమారు కిలోమీటర్ పొడవునా సీఎం చంద్రబాబుతో కలిసి మోదీ రోడ్డు షోలో పాల్గొనన్నున్నారు. ఇందుకోసం ఇన్‌చార్జి బాధ్యతలను స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డికి ప్రభుత్వం కేటాయించింది. దీంతో శుక్రవారం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మితో కలిసి ఆయన రోడ్డు షో ప్రాంతంలో పర్యటించారు. రోడ్డు షో రూట్ మ్యాప్‌ని పరిశీలించి ఆ మార్గానికి ఇరు వైపులా మహిళలను ఏ విధంగా తీసుకురావాలనే దానిపై సమీక్షించారు. కిలోమీటర్ పొడవునా మహిళలు ప్రధానికి చేతులు ఊపుతూ... స్వాగతిస్తూ ప్లకార్డులు ప్రదర్శించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఇందుకోసం గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి మహిళలను సమీకరించాలని ఆదేశించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు ఇబ్బంది పడకుండా తాగునీరు, ఆహార సదుపాయాలను సమకూర్చాలని తెలిపారు. అలానే ఎక్కడికక్కడ రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ సీఈవో సతీష్‌కుమార్, బీసీ సంక్షేమ శాఖ సెక్రెటరి మల్లికార్జున, మెప్మా ఎండీ తేజ్‌భరత్, ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ భార్గవతేజ పాల్గొన్నారు.



ప్రధాని మోదీ పాల్గొనే రోడ్డు షో రూట్‌మ్యాప్‌ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గ్రామానికో.. మోడల్ పాఠశాల

- తరగతికి ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరి
- ప్రాథమిక విద్య పటిష్ఠతకు ప్రభుత్వం కసరత్తు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం అస్తవ్యస్థం చేసిన ప్రాథమిక విద్యా రంగాన్ని పటిష్ఠ పరిచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా మోడల్ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మోడల్ పాఠశాలల ద్వారా ప్రాథమిక విద్యా రంగాన్ని బలోపేతం చేసేలా కార్యచరణ రూపొందించింది. వచ్చే విద్యా సంవత్సరం ఆరంభం నాటికి బడులను చక్కదిద్దేలా విద్యాశాఖ కసరత్తు చేపట్టింది. తక్కువ మంది విద్యార్థులు, ఎక్కువ పాఠశాలలు, తక్కువ మంది ఉపాధ్యాయుల కారణంగా ప్రాథమిక విద్య నానాటికి దిగజారిపోతుంది. చదవడం, రాయడం, లెక్కలు చేయడం వంటి ప్రాథమిక పరిజ్ఞానం కూడా విద్యార్థుల్లో లేదని పలు సర్వేలు చెబుతున్నాయి. ప్రాథమిక విద్య పునాది సరిగా లేకపోవడంతో ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు చదువును అందుకోలేకపోతున్నారని ఆయా సర్వేల్లో తేలింది. ఈ పరిస్థితులను మార్చి ప్రాథమిక విద్యలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు, ఒక గది ఉండేలా మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు కానున్నాయి. ప్రతి గ్రామంలో మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గతంలో ప్రాథమిక పాఠశాలల్లో 120 లేదా 90 మంది విద్యార్థులు ఉంటేనే ఐదుగురు ఉపాధ్యాయులను నియమించేవారు. 60 మంది విద్యార్థులు దాటిన ప్రతి ప్రాథమిక పాఠశాలను మోడల్ పాఠశాలగా ఎంపిక చేసి ఒక్కో తరగతికి ఒకరు చొప్పున ఐదు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులను కేటాయించనున్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో 177 రద్దు చేసి ఉన్నత పాఠశాలల్లో ఉన్న విద్యార్థులను తిరిగి ఆయా మోడల్ పాఠశాలల్లో చేర్చాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కూడా ఫలితాలలో మెరుగు అవుతాయని ఆశిస్తోంది.



మోడల్ కానున్న రామలింగేశ్వరపేట ప్రాథమిక పాఠశాల

అధికారుల్లో ప్రణాళిక లోపం...

ప్రభుత్వ లక్ష్యం ఉన్నతంగా ఉన్నా విద్యా శాఖ అధికారుల్లో ప్రణాళికా లోపం కనిపిస్తోంది. మోడల్ ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేయడంలో అధికారుల్లో సరైన ప్రణాళిక లేకుండా పోయింది. దీంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. అందరికీ అందుబాటులో ఉండేలా మోడల్ ప్రాథమిక పాఠశాలలను నిర్ణయించాలి. కానీ వసతులు పేరిట దూరంగా ఉండే పాఠశాలలను ఎంపిక చేయడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందరికీ అందుబాటులో ఉన్న పాఠశాలలో వసతులు లేవనే సాకుతో వాటిని ఎంపిక చేయడంలేదంటున్నారు. దగ్గర్లో ఉన్న బడిని వదిలి దూరంగా ఉండే పాఠశాలను ఏర్పాటు చేస్తే తమ పిల్లలు వెళ్లలేరంటున్నారు. ఫలితంగా ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరకుండా పోయేలా ఉందని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ ఏ గ్రామంలో, ఏ పట్టణంలో ఎన్ని మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటైన విషయాన్ని కూడా అధికారులు ఇంత వరకు తేల్చలేదు.

పూలింగ్‌కు 80 శాతం అంగీకారం

- నాలుగు గ్రామాల్లో 6641 ఎకరాలు లక్ష్యం
- సమన్యాయం చేస్తామన్న ఎమ్మెల్యే ప్రవీణ్

అమరావతి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి అభివృద్ధిలో భాగంగా రెండో విడత భూ సమీకరణ ద్వారా భూములు ఇచ్చేందుకు 80 శాతం అంగీకారం తెలిపారు. అమరావతి రైల్వేలైను, ఇన్నర్‌రింగ్‌రోడ్, గోదావరి పెన్నా కాల్వ నిర్మాణాలకు సంబంధించి భూముల సేకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో తాము పూలింగ్ ద్వారా ప్రభుత్వానికి భూములు ఇస్తామని అమరావతి మండలం వైకుంఠపురం, ఎండ్రాయి, పెదమద్దూరు, కర్లపూడి గ్రామాల రైతులు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు తెలిపారు. రైతుల విన్నపాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించిన చంద్రబాబు రైతులతో మాట్లాడాలని పల్నాడు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ప్రవీణ్‌లను ఆదేశించారు. ఈ క్రమంలో శుక్రవారం ఎమ్మెల్యే ప్రవీణ్, ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి వైకుంఠపురం, ఎండ్రాయి, పెదమద్దూరు గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ప్రభుత్వాలు మారినా గతంలో మాదిరిగా రైతులు ఇబ్బందులు పడకుండా చట్టాలు చేయాలని కొందరు అధికారులను కోరారు. ఇనాం భూములు, కోర్టు లావాదేవీలలో ఉన్న భూములపై ఎలాంటి చర్యలు తీసుకుంటారని మరికొందరు ప్రశ్నించారు. ఇనాం భూముల విషయంలో రైతులకు న్యాయం చేస్తామని, వివాదాల్లో ఉన్న భూములకు కోర్టులో అనుకూల తీర్పు వచ్చిన తర్వాత న్యాయం చేస్తామని ఎమ్మెల్యే, ఆర్డీవో హామీ ఇచ్చారు. నాలుగు గ్రామాల్లో సమీకరించిన భూములను ఓ యూనిట్‌గా పరిగణించి ఒకే చోట రిటర్న్‌బుల్ ప్లాట్లు కేటాయించి మిగిలిన భూమిని కంపెనీలకు కేటాయిస్తామన్నారు. దీర్ఘకాలికంగా కాకుండా త్వరితగతిన అభివృద్ధి పనులు చేస్తామని ఎమ్మెల్యే రైతులకు తెలిపారు. నాలుగు గ్రామాలలో 4824 మంది రైతుల నుంచి 6641 ఎకరాలు సేకరించాల్సి ఉంది. గ్రామసభల్లో తహసీల్దారు డానియేలు, ఎంపీడీవో శివపార్వతి, ఎంపీటీసీ కుమ్మరి రాజు, సర్వేయర్ భాగ్యలక్ష్మి, సర్పంచ్ విఠల్‌రావు, సంగం డైయిరీ డైరెక్టర్ వలివేటి ధర్మారావు, శౌరయ్య, పాపారావు, జమ్ముల రవీంద్ర, పొదిలె శ్రీనివాస్ పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రవీణ్

మిర్చియార్డుకు వేసవి సెలవులు

● 9వ తేదీ వరకే కొనసాగనున్న ట్రేడింగ్



గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు(గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ)కి మే 12వ తేదీ నుంచి వేసవి సెలవులు రానున్నాయి. ఏటా మే నెల మొదటి వారం తర్వాత యార్డులో పని చేసే పరిస్థితులుండవు. ఒకపక్క ఎండ తీవ్రత, మరోవైపు మిర్చికోరుతో వ్యాపారస్థులు, ఉద్యోగులు, ముఠా కార్మికులు అనారోగ్యం భారిన పడుతుంటారు. దీనిని పరిగణనలోకి తీసుకొని మిర్చి దిగుమతి, ఎగుమతి వ్యాపారస్థులు, కార్మిక సంఘాల విజ్ఞప్తి మేరకు సెలవులు ప్రకటిస్తారు. ఆ విధంగా మే 12వ తేదీ నుంచి వేసవి సెలవులు ప్రకటించాల్సిందిగా అయా సంఘాలు జీఏంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రికకి విజ్ఞప్తి చేశాయి. దీనిపై మార్కెటింగ్ శాఖ లాంచనంగా ఆమోద ముద్ర వేస్తుంది. కాగా మే 9వ తేదీ శుక్రవారం వరకే యార్డులో ట్రేడింగ్ జరుగుతుంది. 10, 11 తేదీలు శని, ఆదివారంలు యార్డుకు సాదారణ సెలవుదినాలు, తిరిగి జూన్ 8వ తేదీన యార్డులో మిర్చి లావాదేవీలు పునఃప్రారంభమౌతాయి.

ప్రమాదవశాత్తు గుండ్లకమ్మలో పడి బాలిక మృతి

నూజెండ్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు గుండ్లకమ్మ నదిలో పడి బా లిక మృతి చెందిన సంఘటన శుక్రవారం పాత ఉప్పలపాడు సమీపంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చీకటి విజయ రాజు కృపావరంల కుమార్తె చీకటి కీర్తి హెరోనిక(11) మధ్యాహ్నం సమయంలో ఇంట్లో వాడుకోనేం దుకు నీటి కోసం సమీపంలోని గుండ్లకమ్మ నదికి వెళ్ళి ప్రమాద వశాత్తు నీటిలో పడి మరణించింది. పది సంవత్సరాల క్రితం పెద్ద కుమారుడు ఇమ్మానియేలు కూడా గుండ్లకమ్మలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

ఏపీ ఫైబర్ సేవల్లో తీవ్ర అంతరాయాలు

తరచూ నిలిచిపోతున్న ప్రసారాలు- నానా ఇబ్బందులు పడుతున్న కేబుల్ ఆపరేటర్లు

వేమూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా వ్యాప్తంగా తరచు ఏపి ఫైబర్ ప్రసారాలు నిలిచిపోతున్నాయి. దీంతో కేబుల్ ఆపరేటర్ల వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా నియమించిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఇటీవల ఏపీ ఫైబర్ సంస్థ తొలగించింది. బాపట్ల జిల్లాలో క్షేత్ర స్థాయిలో పని చేసే సిబ్బంది విధుల నుండి తప్పుకున్నారు. గత నెల రోజుల నుండి ఏపీ ఫైబర్ ప్రసారాల్లో తరచూ అంతరాయం కల్గుతుంది. ప్రసారాల అంతరాయంపై మాట్లాడేందుకు ప్రస్తుతం ఉన్న అధికారులు స్పందించడం లేదు. గత ప్రభుత్వం ఏపి ఫైబర్ నెట్ వర్కుపై శ్రద్ధ చూపని కారణంగా కేబుల్ ప్రసారాలు చేసే వైర్లు ఎక్కడ పడితే అక్కడ కిందకు వేలాడుతూ తెగిపోతున్నాయి. వైర్లు తెగి ప్రసారాలు ఆగిపోతే పునరుద్ధరించేవారు లేరు. దీంతో జిల్లా కేంద్రం బాపట్లతో పాటు రేపల్లె, వేమూరు నియోజకవర్గాలతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లోనూ అంతరాయం సమస్యతో పలు మండలాల ఆపరేటర్లు వినియోగదారులకు సమాధానం చెప్పలేక సతమతమవుతున్నారు. గత నెల రోజుల నుండి ఆపరేటర్లు ప్రైవేట్ టెక్నిషియన్ల ద్వారా తెగిన వైర్లను సరి చేయించుకుంటున్నారు. ప్రసారాల్లో నాణ్యత, తరచూ అంతరాయాల కారణంగా వినియోగదారులు నెలవారీ నగదును ఇవ్వడం లేదని ఆపరేటర్లు వాపోతున్నారు. కాని ఇక్కడ నెలవారి నగదును మాత్రం ఏపిఫైబర్ కేబుల్ ఆపరేటర్ల నుండి ముందుగానే తీసుకుంటుంది. పైగా యాక్టివ్‌లో లేని ఏపీ ఫైబర్ సెటప్ బాక్సులకు అద్దె రూపంలో ప్రతి నెలా రూ.60లు వ్యాలెట్‌లో కోత విధిస్తున్నారు. అంతే కాకుండా ప్రస్తుతం ఉన్న వినియోగదారులు అంతరాయాల కారణంగా వేరే నెట్ వర్కులకు మారిపోతున్నారు. దీంతో వినియోగదారులు సంఖ్య తగ్గిపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని ఆపరేటర్లు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలకు కేబుల్ ఆపరేటర్ల తమ స్వంత ఖర్చులతో ఏపి ఫైబర్ నెట్ కనెక్షన్లు అందించారు. ఆయా కనెక్షన్లు అందించినందుకు గాను కొంత శాతం నగదును ఆపరేటర్లకు చెల్లిస్తామని గత ప్రభుత్వం చెప్పింది. కాని గత ప్రభుత్వం పైసా కూడా తమకు చెల్లించలేదని ఆపరేటర్ల చెబుతున్నారు. కరోనా సమయం నుంచి ఐటి ఉద్యోగులు ఇప్పటికి పలుచోట్ల వర్క్ ఫ్రం హోమ్ కొనసాగిస్తున్నారు. వారి కోసం కరోనా సమయంలో ఏపిఎస్ఎఫ్ఎల్ సంస్థ నెట్ కనెక్షన్లు కేబుల్ ఆపరేటర్ల ద్వారా అందించింది. ప్రస్తుతం జరుగుతున్న అంతరాయాల కారణంగా ఐటి ఉద్యోగులు తమ వర్క్‌ను పూర్తి చేయలేక ఈ నెట్‌వర్క్‌తో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆపరేటర్లను నిందిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మానస పుత్రిక అయిన ఏపి ఫైబర్ పరిస్థితి ఇలాగే కొనసాగితే అతి తక్కువ కాలంలోనే రాష్ట్ర వ్యాప్తంగా సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆపరేటర్లు చెబుతున్నారు. అవినీతి జరిగిందని ప్రభుత్వం ఏపి ఫైబర్ సంస్థలో కూలంకషంగా సోదాలు చేస్తున్నట్లు వినికిడి. అయితే జిల్లా స్థాయిలో ఉన్న అధికారులను కూడా విచారించడంతో పాటు, క్షేత్ర స్థాయిలో విచారణ జరిపితే ఇక్కడ ఉన్న దొంగలు కూడా బయటకు వస్తారని ఆపరేటర్లు చెబుతున్నారు. ఇదిలా ఉంటే మరో వైపు తొలగించిన సిబ్బంది స్థానంలో ప్రత్యామ్నాయ సిబ్బందిని తక్షణ నియామకాలు చేపట్టకపోవడంతో ఏపీఎస్ఎఫ్ఎల్ ప్రసారాల్లో నిరంతర అంతరాయాలతో వినియోగదారులు, ఆపరేటర్లు పడుతున్న ఇబ్బందులపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించి వెంటనే తాత్కాలిక నియామకాలను చేపట్టి తమను రక్షించాలని కేబుల్ ఆపరేటర్లు కోరుతున్నారు. లేనిపక్షంలో ఏపీఎస్ఎఫ్ఎల్‌ను నమ్ముకుని తాము వెచ్చించిన లక్షలాది రూపాయలు నష్టపోతామని ఆపరేటర్లు ఆవేదన చెందుతున్నారు.

అధిక రక్తపోటు నియంత్రణతో పక్షవాతం నుంచి రక్షణ

● ఐఎస్ఏ జాతీయ అధ్యక్షురాలు విజయ

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఏటా 18 లక్షల మంది పక్షవాతం బారిన పడుతున్నారని, వీరిలో 25 శా తం మంది 40 ఏళ్లలోపు వయస్సు వారేనని ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ (ఐఎస్ఏ) జాతీయ అధ్యక్షురాలు, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పీ విజయ తెలిపారు. శుక్రవారం ప్రభుత్వాస్పత్రిలో న్యూరాలజీ విభాగం ఆధ్వర్యంలో 'చెక్ బీపీ స్టాప్ స్ట్రోక్' క్యాంపెయిన్‌లో భాగంగా రోగులకు, వారి సహాయకులు బీపీ పరీక్షలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ విజయ రోగులను ఉద్దేశించి మాట్లాడారు. బీపీని ముందుగానే తెలుసుకొని మందులు, ఆహార నియమాలతో నియంత్రిస్తే 80 శాతం వరకు పక్షవాతం సోకకుండా నివారించవచ్చన్నారు. అందువల్ల 18 ఏళ్లు నిండిన వారంతా తప్పనిసరిగా బీపీ పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. ఒకవేళ బీపీ ఉంటే డాక్టర్ల సలహా మేరకు తగిన మందులు వాడుతూ బీపీని నియంత్రణలో ఉంచుకోవాలని డాక్టర్ విజయ సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెడెంట్ డాక్టర్ ఎస్ ఎస్వి రమణ, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ, న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీపీ చెకప్‌కు సంబంధించిన కరపత్రాలను డాక్టర్ విజయ, డాక్టర్ సుందరాచారీ, డాక్టర్ రమణ తదితరులు విడుదల చేశారు. అనంతరం ఐఎస్ఏ ఆధ్వర్యంలో నగరంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, న్యాయవాదుల సంఘం, హోల్ సేల్ మందుల దుకాణ వ్యాపారుల సంఘం, మలినేని ఇంజనీరింగ్‌కాలేజీ, ప్రజావేదిక తదితర ప్రాంతాల్లో ఉచిత బీపీ వైద్యపరీక్ష శిబిరాలను నిర్వహించారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న విజయ, రమణ, సుందరాచారీ

స్పందన లేని.. ఫీజు ఆఫ్ కాల్

● సీజీఆర్ఎఫ్‌కు విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదు
● చైర్మన్, రిటైర్డ్ జడ్జీ విక్టర్ ఇమ్మానుయేల్

గుంటూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): లో వోల్టేజ్ సమస్యలపై ఫిర్యాదు చేసినా.. ఫీజు ఆఫ్ కాల్‌కు ఫోన్ చేసినా స్పందించడం లేదంటూ విద్యుత్ వినియోగదారులు సీజీఆర్ఎఫ్((కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ ఫోరం)కు ఫిర్యాదులు చేశారు. గుంటూరు టౌన్-1 డివిజన్ పరిధిలోని విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్ నేతృత్వంలో శుక్రవారం స్థానిక సంగడిగుంటలోని విద్యుత్‌భవన్‌లో అదాలత్ జరిగింది. మొత్తం 15 సమస్యలపై వినియోగదారులు ఫిర్యాదులు చేయగా అక్కడికక్కమే పది సమస్యలను పరిష్కరించినట్లు చైర్మన్ తెలిపారు. కొత్తపేటలో ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫారం, నాయుడుపేట ప్రాంతంలో లోవోల్టేజ్, ఆంజనేయపేట నివాసాలపై హెచ్‌టీ లైన్లు తదితర ఫిర్యాదులను చైర్మన్ స్వీకరించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ఏపీ సీపీడీసీఎల్ పరిధిలో మొత్తం 10 లోపే ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వినియోగదారులు అవసరమైతే సమస్యలపై గుణదలలోని సీజీఆర్ఎఫ్ కార్యాలయంలో, 9491034319 నెంబరు ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. తమకు వచ్చిన ఫిర్యాదులను గరిష్ఠంగా రెండు నెలలలోపు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ ఆర్థిక, టెక్నికల్ సభ్యులు ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్ శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యులు సునీత, సర్కిల్ ఎస్ఏవో పాశం రామిరెడ్డి, గుంటూరు టౌన్-1 ఆపరేషన్ ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు తదితరులు ఉన్నారు.



వినియోగదారుడు నుంచి ఫిర్యాదు తీసుకుంటున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఇమ్మానుయేల్, సభ్యులు

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

తెనాలి రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు చేసుకున్న ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఆనంద్ కథనం ప్రకారం మండలంలోని గుడివాడకు చెందిన కామంచి ఆమని (34) కొంతకాలంగా గ్రామంలోని ఓ కోళ్లఫారంలో రోజువారి కూలీగా పనిచేస్తున్నది. గ్రామానికి చెందిన పాలపర్తి మహేష్ ఆమె వెంట పడుతూ ప్రేమిస్తున్నానంటూ వేధింపులకు గురిచేసేవాడు. దానితో ఆగక పదే పదే ఫోన్ చేస్తూ అసభ్యంగా మాట్లాడుతూ ఇబ్బందులకు గురిచేసేవాడు. దీనిపై ఆమె పనిచేసే కోళ్ల ఫారం యజమాని దృష్టికి తీసుకురాగా మహేష్‌ను పిలిపించి మందలించాడు. దీంతో కొన్ని రోజులు పాటు వేధింపులు ఆపిన మహేష్, ఈ నెల 4న సాయంత్ర సమయంలో కోళ్లఫారంలో పనులు ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో ఆమె వెంటపడటంతో విషయాన్ని భర్తకు చెప్పింది. దీంతో మహేష్‌ను మందలించేందుకు ఇంటికి వెళ్లితే అతడి తల్లి, కుమారుడు కలిసి మూడు సంవత్సరాలుగా ఇద్దరి మధ్య అక్రమ సంబంధం కొనసాగుతుందంటూ చెప్పి ఇదే విషయాన్ని గ్రామస్తులందరికీ ప్రచారం చేయడంతో వివాహిత మనస్థాపానికి గురైంది. దీంతో ఈ నెల 23న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. అక్కడ పోలీసులు ఆమె వాంగ్మూలం తీసుకోగా మహేష్, ఆమె తల్లి రమాదేవి చేసిన అసత్య ప్రచారాన్ని తట్టుకోలేకే ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు చెప్పింది. ఆమె చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఇరువురిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డి మందు తాగిన నిందితుడు

వివాహిత ఆమని ఆత్మహత్య కేసులో ఏ-1గా ఉన్న నిందితుడు మహేష్ శుక్రవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఉదయం కేసులో ముద్దాయిలను విచారణకు తీసుకురాగా పోలీసుల కళ్లుకప్పి ఇంటికి వెళ్లి గడ్డి మందు తాగినట్లు సమాచారం. గమనించిన బంధువులు అతడిని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరించారు. మెరుగైన చికిత్స నిమిత్తం పొన్నూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.

టీడీపీలోకి వైసీపీ కౌన్సిలర్

ఎమ్మెల్యే జూలకంటి సమక్షంలో చేరిక


మాచర్లటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పురపాలక సంఘానికి చెందిన 29వ వార్డు వైసీపీ కౌన్సిలర్ షేక్ సుభానిసాహెబ్ మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి సమక్షంలో శుక్రవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి కౌన్సిలర్ సుభానికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మాచర్ల పట్టణం అభివృద్ధికి నోచుకోలేదని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పట్టణాభివృద్ధి కోసం పాటుపడడం తమకు నచ్చిందని అం దుకే టీడీపీలో చేరినట్లు కౌన్సిలర్ సుభాని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ యువనేత జూలకంటి అక్కిరెడ్డి పాల్గొన్నారు.



కౌన్సిలర్ సుభానిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

రైలు దోపిడి నిందితులు అరెస్ట్


తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికులపై కర్రలతో దాడి చేసి వారి సెల్‌ఫోన్‌లను చోరీ చేస్తున్న ఇద్దరు నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు జీఆర్‌పీ ఎస్సై వెం కటాద్రి తెలిపారు. ఈనెల 21న కాకినాడ తిరుపతి ట్రైన్‌లో ప్రయానిస్తున్న మాచర్ల సంతోష్‌కుమార్‌పై నిడుబ్రోలు రైల్వే స్టేషన్ సమీపంలో కర్రతో దాడి చేసి సెల్‌ఫోన్‌ను చోరీ చేశారు. తన సెల్ ఫోన్ కు కాల్ చేయగా రూ. 20 వేలు ఇవ్వాలని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల విచారణలో దాడికి పాల్పడింది నిడుబ్రోలుకు చెందిన దేవర సాయి, యర్రంశెట్టి వంశీలను గుర్తించి అరెస్ట్ చేసి విజయవాడ రైల్వే కోర్టులో ప్రవేశపెట్టగా ఇద్దరు నిందితులకు రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు. నిందితులు వినియోగించిన ద్విచక్రవానాన్ని సీజ్ చేశామన్నారు.



నిందితుల వివరాలను తెలుపుతున్న జీఆర్‌పీ ఎస్ఐ వెంకటాద్రి తదితరులు

ప్రధాని భేటీలో సీఎంతో కలిసి పాల్గొన్న జిల్లా ఎంపీలు

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించేందుకు సీఎం చంద్రబాబుతో కలిసి జిల్లా ఎంపీలు పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం న్యూఢిల్లీలోని ప్రధాన మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుకు పాల్గొనే అవకాశం లభించింది.



హోరాహోరీగా ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన

జూనియర్ విభాగం విజేతలుగా బాపట్ల, తెలంగాణ ఎడ్ల జతలు



మొదటి బహుమతిని కైవసం చేసుకున్న ఎడ్లు

వినుకొండటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మదమంచిపాటి వీరాంజనేయ స్వామి తిరునాళ్ల సందర్భంగా కొనసాగుతున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. జూనియర్ విభాగంలో జరిగిన పోటీల్లో పలు ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. బాపట్ల జిల్లా వేటపాలేనికి చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణచౌదరి ఎడ్లు, తెలంగాణకు చెందిన రోహన్‌బాబు ఎడ్లు 3,750 అడు గులు బండ లాగి మొదటి స్థానంలో సమానంగా నిలిచాయి. పోటీల్లో రెండు జతలు మొదటి స్థానంలో నిలబడటంతో మొదటి, రెండో బహుమతిని కలిపి ఇద్దరికీ సమానంగా ప్రదానం చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లి బుర్రముక్క కౌశల్యారెడ్డికి చెందిన ఎడ్లు 3,508 అడుగులు లాగి మూడో స్థానంలో నిలిచాయి. గుంటూరుకు చెందిన సోమిశెట్టి ఆంజనేయులు ఎడ్లు 3,507 అడుగులు లాగి 4వ స్థానం కైవసం చేసుకున్నాయి. ప్రకాశం జిల్లా బేస్తవారిపేట ఖాజీపురానికి చెందిన వేగినాటి ఓసురారెడ్డి, బండి సాహిత్‌శ్రీభవన్ ఎడ్లు 3,250 అడుగులు లాగి 5వ స్థానం, గుంటూరు రూరల్ మండలం లింగాయపాలేనికి చెందిన యలం సాంబశివరావు ఎడ్లు 3వేలు అడుగులు లాగి 6వ స్థానం, కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం నాదెండ్లవారిపాలేనికి చెందిన కాకర్ల సురేష్ ఎడ్లు 2,910 అడుగులు లాగి 7వ స్థానం, ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం బొప్పూడివారిపాలేనికి చెందిన చిట్టిపోతు రామాంజనేయులు ఎడ్లు 2,518 అడుగులు లాగి 8వ స్థానం, నల్గొండ జిల్లా నిడమానూరు మండలం సూరేపల్లికి చెందిన ఎస్.అనంత రాములుకు చెందిన ఎడ్లు 2,251 అడుగులు లాగి 9వ స్థానంలో నిలిచాయి. వినుకొండ 32వ వార్డు కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి మొదటి బహుమతి రూ. 80వేలు, వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీ ముప్పాళ్ల జ్ఞానేశ్వరావు రూ.70వేలు, గీతాంజలి పాఠశాల అధినేత ఎండ్లూరి శేషగిరిరావు రూ.60వేలు, పోకా అనంతబాబు, అజయ్‌బాబు, కామని శ్రీనివాసరావు రూ.50 వేలు, వినుకొండ పట్టణంలోని జయతి హాస్పిటల్ యజమాని డాక్టర్ కాకాని వెంకట సురేంద్ర రూ.40 వేలు, కంచర్ల రాంబాబు, కిరణ్‌బాబు, ఆదిబాబు రూ.30 వేలు, వంకాయలపాటి పేరయ్య రూ.20 వేలు, గురిజాల ఆదినారాయణ రూ.15 వేలు, ఆర్‌ఎంపీ డాక్టర్స్ సంఘం అధ్యక్షుడు పాశం నాగమల్లేశ్వరరావు రూ.10వేలు నగదు విరాళాన్ని అందజేశారు. శుక్రవారం ఉదయం నుంచి సీనియర్ విభాగానికి చెందిన 12 జతల ఎడ్లు.పోటీల్లో నువ్వా నేనా అన్నట్లుగా తలపడుతున్నాయి. పోటీలను తిలకించేందుకు వచ్చిన వారిని కట్టడి చేయడం పోలీసులకు పెద్ద తలనొప్పిగా మారింది. పోటీల సందర్భంగా మదమంచిపాటి స్వామి దేవాలయం ఆవరణలో మక్కెన చినరామయ్య పేరుతో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ఈ నెల 18 నుంచి అన్నదానం కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. పోటీలను తిలకించేందుకు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొని పోటీలను ఆసక్తిగా తిలకించి ఎడ్ల యజమానులను అభినందించారు.కార్యక్రమంలో నిర్వాహకులు మక్కెన వెంకట్రావు, అనుమోలు సుబ్బారెడ్డి, మాదాల చిరంజీవి, కుంటా కోటిరెడ్డి, జగ్గారెడ్డి, అక్కిరెడ్డి, గురువారెడ్డి, కుంటా కోటిరెడ్డి, తిప్పిరెడ్డి, అంజిరెడ్డి, చప్పిడి రామారావు, పోకా సుబ్బారావు, నాగులపాటి గుర్నాథం, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తాం

రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం అసోసియేషన్ కార్యవర్గ సమావేశం గుంటూరు కేంద్ర గ్రంథాలయం ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు అనేక సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు లోకేష్ సహకారంతో త్వరలో పరిష్కరిస్తామన్నారు. గ్రంథాలయ ఉద్యోగులకు త్వరలో పూర్తిస్థాయి గ్రాంట్ సాధిస్తానని, ఉద్యోగులు ఎదుర్కొంటున్న, ప్రమోషన్లు, ఉద్యోగాలు భర్తీ .. మొదలగు అనేక సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని తెలియజేశారు. అలాగే ఉద్యోగులు అందరూ సక్రమంగా పనిచేస్తూ గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలను జయప్రదం చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మ, ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కార్యదర్శులు సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, అధ్యక్షులు తిరుమలశెట్టి నరసింహారావు, పెన్షనర్ సంఘం అధ్యక్షులు మల్లేశ్వరరావు, త్రిమూర్తులు గ్రంథాలయ సంస్థల ఉద్యోగులు, పెన్షన్ దారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోటేశ్వరరావు, హాజరైన ఉద్యోగులు ,పెన్షనర్లు

ఇన్‌చార్జి ఎస్‌ఈగా నాగరాజు

రెంటచింతల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఇన్‌చార్జి ఎస్‌ఈ వి.నాగరాజును నియమిస్తూ శ్రీశైలం ప్రాజెక్టు సీఈ కాంతారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి దాకా ఎస్‌ఈగా పనిచేసిన కె.వేంకటరమణ సెలవుపై వెళ్లడంతో ఈ నియామకం అవసరమైంది. నాగరాజు ఎలక్ట్రికల్ డీఈగా వ్యవహరిస్తున్నారు.

ఉగ్రదాడికి నిరసనగా శాంతియుత ర్యాలీ

● కొవ్వొత్తులు, నల్లరిబ్బన్లు, జాతీయజెండాలతో ప్రదర్శనలు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రశాంతతకు భంగం కలిగించేందుకు ఉగ్రవాదులు దాడులు చేయడం శోచనీయమని కూటమి నేతలు తెలిపారు. శుక్రవారం పట్టణంలో శాంతియుత ర్యాలీ నిర్వహించి ఐలాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా కూటమి నేతలు పాండురంగ శ్రీను, ఏఎంసీ చైర్మన్ తురకా వీరస్వామి, షేక్ బాబావలి, సయ్యద్ అమీర్‌అలీ, కటకం అంకారావు, దూదేకుల ఖాశింసైదా, కామిశెట్టి రమేష్, వెంకయ్య తదితరులు మాట్లాడుతూ కాశ్మీర్ ఘటనను ఖండించారు. ఈ ర్యాలీలో కనిగిరి శ్రీను, పిల్లి చెన్నారావు, వీవీ నాగేశ్వరరావు, నెకరికంటి శివ, వల్లెపు రామకృష్ణ, యరగాని వెంకట్, దూదేకుల సలీమ్, షేక్ ముజీబ్, కార్ సైదా, హనుమంతరావు, నూతి అనురాధ, వెంకటరమణ అంబటి సాయి, నడికూడి వెంకటేశ్వరరావు, చింతల అజయ్, తదితరులు పాల్గొన్నారు.

అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో..

కాశ్మీర్‌లోని పహల్గాం ఘటనలో ప్రజలపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ పిడుగురాళ్ల అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఉస్మాన్‌మేస్త్రీ మాట్లాడుతూ దేశ సమగ్రతను దెబ్బతీయడానికి అమాయకప్రజలపై ఉగ్రవాదులు దాడిచేయడాన్ని పిరికిపంద చర్యగా పేర్కొన్నారు. కార్యక్రమంలో షేక్ అమీర్, జైలాబ్దిన్, సుభాని, ఎండీ గఫార్, షేక్ మస్తాన్‌వలి, పఠాన్ మాబు, అబ్దుల్ కరీం, జాని, లతీఫ్, ఎండీ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

నల్లజెండాలతో..

ఇస్లాం మతాచారం ప్రకారం అన్యాయంగా ఒకరిని చంపితే సమస్త మానవాళిని చంపినట్లేనని, ఇస్లాం పేరుతో ఉగ్రదాడులు చేసేవారు అసలు ముస్లింలే కాదని.. ఖురాన్ చదివితే మరొకరిని చంపరని ముక్తి మౌలానా షఫుద్దీన్ అన్నారు. శుక్రవారం పిడుగురాళ్ల ముస్లిం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపుమేరకు పహల్గాం దాడిలో మృతి చెందిన భారతీయలకు సంతాపంగా నల్లరిబ్బన్లు, నల్లజెండాలు చేతబూని నిరసన తెలుపడంతో పాటు జాతీయ జెండాలు ధరించి మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో సూఫీ మస్జిద్, ముతవల్లి షేక్‌రజాక్, షేక్ షరీఫ్, సయ్యద్ ఆరీఫ్, షేక్ మున్నా, గోల్డ్ సైదా, తాజుద్దీన్, నన్నేసా, ఖాశిం, సుభాని, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

ఫణిదంలో కొవ్వొత్తులతో..

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ మండలంలోని ఫణిదం గ్రామంలో శుక్రవారం రాత్రి సీపీఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న సీపీఎం నాయకులు మాట్లాడుతూ సామాన్యులపై కాల్పులు జరిపి చంపటం దుర్మార్గం అన్నారు. ఉగ్రవాదం నశించాలి.. ఉగ్రవాదంపై కఠినచర్యలు తీసుకోవాలి.. దేశ సమైక్యతను కాపాడుకోవాలని సీపీఎం నాయకులతో పాటు గ్రామస్తులు నినాదాలు చేశారు. దాడిలో మృతి చెందినవారికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం గ్రామ పార్టీ కార్యదర్శి వంగర తులసీరామ్, పార్టీ మండల కమిటీ సభ్యులు రావూరి పూర్ణచంద్రరరావు, వెంకటేశ్వర్లు, రాజు, సాయి పాల్గొన్నారు.

గురజాలలో..

గురజాలటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రయోజనాలు, సార్వభౌమత్వానికి భంగం కలిగించే ఉగ్రవాద దాడుల్ని సహించేది లేదని గురజాల నగర పంచాయతీ చైర్మన్ షేక్ బడేజాని అన్నారు. శుక్రవారం పట్టణంలోని మసీదులో ముస్లింలతో కలిసి ఆయన మాట్లాడారు. కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాద దాడుల్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దేశంలో అన్ని మతాల వారు ఐక్యమత్యంతో జీవిస్తుంటే ఓర్వలేని కొన్ని శక్తులు ఈ ఐక్యతను దెబ్బతీసేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అనంతరం మసీదులో జనగణమన గీతాన్ని ఆలపించి ముస్లింలు దేశభక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో యూనస్, సీపీఐ హుస్సేన్, బషీర్, షేక్ నాగుల్‌మీరా, అబ్దుల్లా, మస్తాన్‌వలి, సహారా బాబు, బుడే తదితరులు పాల్గొన్నారు.

వామపక్షాల ఆధ్వర్యంలో..

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రదాడిని నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. దాడిలో మృతిచెందినవారికి కొవ్వొత్తులను వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.సూరిబాబు, సీపీఐ నాయకుల ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

పెదకూరపాడు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాద దాడి మానవత్వంపై, శాంతిపై దాడి అని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఘంటా గోపీ అన్నారు. పెదకూరపాడులో శు క్రవారం రాత్రి ఉగ్రవాద దాడిని నిరసిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పెర ఉదయశంకర్, బంకా కోటి, తాళ్ళూరి వినయ్, పిన్నలూరి నాగబాబు, రేపూడి దేవకుమార్ పాల్గొన్నారు.



పెదకూరపాడులో కొవ్వొత్తుల ర్యాలీ


పిడుగురాళ్లలో శాంతియుత నిరసన తెలుపుతున్న ముక్తి మౌలానా షఫుద్దీన్ తదితరులు


అమరావతి: కొవ్వొత్తులతో నివాళులర్పింస్తున్న వామపక్ష నేతలు


గురజాల: ఉగ్రదాడులకు ముస్లింల నిరసన


పిడుగురాళ్లలో జాతీయ జెండాతో కూటమి నేతల నిరసన


పిడుగురాళ్ల: పహల్గాం ఘటనకు నిరసన తెలియజేస్తున్న అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఉస్మాన్‌మేస్త్రి, ముస్లింలు

పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తా

● తహసీల్దార్ మేరీ కనకం

రెంటచింతల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో వున్న సమస్యలను పరిష్కరించడానికి కృషిచేస్తానని తహసీల్దార్ మేరీ కనకం అన్నారు. శుక్రవారం మాజీ సర్పంచ్ అల్లం ప్రతాపరెడ్డి నేతృత్వంలో పలువురు నేతలు ఆమెను ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి, తుమ్మా జోజిరెడ్డి, గంజి బాలిరెడ్డి తదితరులున్నారు.

న్యాయాధికారికి ఘన సన్మానం


బదిలీపై వెళ్తున్న న్యాయాధికారి మురళీగంగాధరరావును సన్మానిస్తున్న న్యాయవాదులు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారిగా విధులు నిర్వహించి బదిలీపై రంపచోడవరం వెళ్తున్న న్యాయాధికారి మురళీగంగాధరరావును పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ సభ్యులు శుక్రవా రం ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కుమారస్వామి, సీనియర్ అసోసియేషన్ సభ్యులు దారా చెన్నయ్య, కోపూరి వెంకటేశ్వర్లు, సభ్యులు పి.మాణిక్యం, మం దా జాకబ్, ఎం శ్రీనివాసరావు, కేవీవీ కోటేశ్వరరావు, పి.నవ్య, తదితరులు న్యాయాధికారిని కలిసి ఘనంగా సత్కరించారు.

పెరిగిన దేవాలయ భూముల కౌలు వేలం ఆదాయం

రెంటచింతల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టగుడిపాడు శ్రీవేణుగోపాలస్వామి ఆలయ భూములైన 12.50 ఎకరాలకు వేలం నిర్వహించగా గతంలో కన్నా రూ.32,500వేలు ఆదాయం అధికంగా వచ్చినట్లు ఎండోమెంట్ ఈవో గాదే రామిరెడ్డి చెప్పారు. ఈ ఏడాది రూ.94,000 ఆదాయం వచ్చిందన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం గురువారం నాటికి 514.50 అడుగులు ఉంది. ఇది 139.43 టీఎంసీలకు సమానం. ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పులిచింతల...

అచ్చంపేట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 26.96 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా 4వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

మాచవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాలెంలో గురువారం ఈతకు వెళ్ళి మృతిచెందిన ఇరువురు చిన్నారుల మృతదేహాలను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, డాక్టర్ అశోక్‌కుమార్‌లు సందర్శించి నివాళులర్పించారు. తల్లిదండ్రులను పరామర్శించారు. వారి వెంట జెడ్పీటీసీ శివయాదవ్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ మండల కన్వీనర్‌గా మద్దు

వైసీపీ మాచవరం మండల కన్వీనర్‌గా మద్దు ప్రసాదు నియమితులయ్యారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ప్రసాదును మండల కన్వీనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బాల్య వివాహాలు, గృహహింసను నిరోధించాలి

పెదకూరపాడు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు, గృహ హింస, మానవ అక్రమరవాణా లాంటి వాటిని నిరోధించటానికి శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని ఎంపీడీవో సోమయాజులు అన్నారు. పెదకూరపాడులో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత గ్రామ కార్యకర్తలకు సురక్షిత గ్రామజ్యోతిపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ కో-ఆర్డినేటర్ కొండపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఫ్రైచాయిస్ ల్యాంప్ సంస్థ సురక్షిత గ్రామాల కోసం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో బాలల అభివృద్ధి రక్షణ అధికారి సరళ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ మున్ని, ల్యాంప్‌సంస్థ ప్రతినిధులు తురక మంగయ్య, షేక్ బాజీ పాల్గొన్నారు.


సురక్షిత గ్రామజ్యోతి పుస్తకాలను చూపుతున్న ఎంపీడీవో సోమయాజులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


రాజుపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది



బెల్లంకొండ: చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది


క్రోసూరులో జరిగిన మలేరియా దినోత్సవ ర్యాలీ

రాజుపాలెం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు రవితేజనాయక్ కోరారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాజుపాలెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వైద్యులు రవితేజనాయక్ మాట్లాడుతూ మలేరియా అంతం మనతోనే జరగాలన్నారు. ప్రజలందరిలో మార్పువస్తే మలేరియాను అంతంచేయవచ్చన్నారు. వర్షాకాలంలో ప్రజలందరూ పరిసర ప్రాం తాలలో నీటినిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు ఉన్నారు.

బెల్లంకొండ మండలంలో..

బెల్లంకొండ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం చంద్రాజుపాలెంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో ఆరోగ్య కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాషా, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

క్రోసూరు మండలంలో..

క్రోసూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మలేరియా వ్యాప్తిచెందకుండా ప్రతిఒక్కరు కృషిచేయాలని క్రోసూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మహమ్మద్ షాద్ పిలుపునిచ్చారు. మలేరియావ్యాధిపై అవగాహనకల్పిస్తూ శుక్రవారం క్రోసూరులో ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్ మాట్లాడుతూ మురికికాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోవటం వల్ల దోమలు వ్యాప్తిచెంది మలేరియా వ్యాప్తికి కారణమవుతున్నాయన్నారు. మురుగునీరు నిల్వ ఉన్నచోట వారానికొకసారి కిరోసిన్‌గాని, ఇంజన్ ఆయిల్‌గాని చల్లాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శివుడు, ఫార్మసిస్టు పాతిమా, ఆరోగ్య కార్యకర్తలు, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముప్పాళ్లమండలంలో..

ముప్పాళ్ళ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా మలేరియాను తరిమేయవచ్చని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి అన్నారు. ముప్పాళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా గీతాంజలి మాట్లాడుతూ నీటి కంటెయినర్లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ జయకృష్ణ, సీహెచ్‌ఓ దస్తగిరి, ఉస్మాన్, ఆరోగ్య పర్యవేక్షులు పీటర్ డామియెన్, జోస్ఫిన్ రాణి, రాధ ఉన్నారు.

విద్యార్థినులకు కలెక్టర్ అభినందనలు


పావని చంద్రికను అభినందిస్తున్న కలెక్టర్

కారంపూడి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయంగా నిలిచిన మండలంలోని ఒప్పిచర్ల జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని పావని చంద్రిక, కారంపూడి బ్రహ్మనాయుడు జడ్పీహెచ్ఎస్‌కు చెందిన కోనేటి కావ్యశ్రీలను కలెక్టర్ అరుణ్‌బాబు అభినందించారు. శుక్రవారం స్వయంగా విద్యార్థినుల గృహాలకు వెళ్లి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ విద్యార్థినుల ఉన్నత చదువుకు అయ్యే ఖర్చును ప్రభుత్వం భరిస్తుందని, తన వంతు కూడా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో డీఈవో చంద్రకళ, గురజాల ఆర్డీవో మురళి, తహసీల్దార్ వెంకటేశ్వరనాయక్, ఎంఈవో 2 రవికుమార్, ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి, హెచ్ఎం అనంతశివ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన ఉపాధిని కల్పించాలి

ప్రజలకు మెరుగైన ఉపాధి కల్పించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. శుక్రవారం కారంపూడిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను, పశువుల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్టెను పరిశీలించారు. అనంతరం ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా కూలీలకు సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు.



కావ్యశ్రీని అభినందిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు


నీటితొట్టెను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

సులభతరంగా భవన నిర్మాణ అనుమతులు

గురజాలటౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రజలు స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించి సులభతరంగా భవన నిర్మాణ అనుమతులు పొందవచ్చని నగర పంచాయతీ కమిషనర్ శివన్నారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ-కార్యాలయం ద్వారా లైసెన్సు పొందిన టెక్నికల్ పర్సన్, సర్వేయర్, ఇంజనీర్ల ద్వారా గ్రామకంఠం, అధికార లేఅవుట్లు, ఏరియా డెవలప్‌మెంట్, సర్క్యులేషన్ పాటర్న్ మొదలగు ప్రాంతాల్లో నివాసం కొరకు భవన నిర్మాణ అనుమతులు స్వీయ ధ్రువీకరణపత్రం సమర్పించి సులభంగా, వేగంగా, పారదర్శకంగా పొందగలరని చెప్పారు. ఐటీఐ సివిల్, డిప్లమో సివిల్, బీటెక్ సివిల్ పూర్తి చేసిన అభ్యర్థులు టెక్నికల్ పర్సన్స్, సర్వేయర్, ఇంజనీర్ల లైసెన్సు కొరకు నగర పంచాయతీ కార్యాలయంలో గానీ, ఆన్‌లైన్‌లో గానీ దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ అన్నారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య


బుజ్జిబాయి మృతదేహం

దుర్గి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నెహ్రూనగర్ తండాలో జరిగింది. గ్రామానికి చెందిన రమావత్ బుజ్జిబాయి (50) కుటుంబ కలహాలతో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ సుధీర్‌కుమార్ సంఘటనా ప్రదేశానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి భర్త నక్రు, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

దాడి కేసులో నిందితుల అరెస్టు

మాచర్ల రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మలమడక గ్రామానికి చెందిన టీడీపీ నేతలు జలసూత్రపు శ్రీకాంత్, పవన్ నరసింహలపై ఈనెల 18వ తేదీన దాడికి పాల్పడిన 12మంది వైసీపీ నేతలను రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వైసీపీకి చెందిన మల్లెల రామకృష్ణ, యలమంద, ఆంజనేయులు, హనుమంతు, కూరాకుల బ్రహ్మయ్య, కూరగంటి ప్రవీణ్, మల్లెల రమణ, చావా రవి, మల్లెల కనకయ్య, పున్నయ్య, కూరాకుల శ్రీనివాసరావు, గాయత్రిలను శుక్రవారం అరెస్ట్ చేసి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరుచగా న్యాయాధికారి ప్రశాంత్ నిందితులకు 14 రోజులు రిమాండ్ విధించినట్లు రూరల్ ఎస్ఐ రవిబాబు తెలిపారు. నిందితులను గురజాల సబ్ జైలుకు తరలించినట్లు చెప్పారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

● రూ.80 వేల ఆస్తి నష్టం

రెంటచింతల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన సంఘటన రెంటచింతల పరిధిలోని రేగులమాణ్యంలో శుక్రవారం జరిగింది. చలంచర్ల శ్రీను సిమెంట్ ఒరలు తయారుచేస్తూ జీవిస్తుంటాడు. వేకువజామున లైట్లు వేస్తున్న సమయంలో ఒక్కసారిగా ఇంటినిండా మంటలు వ్యాపించి గృహోపకరణాలన్నీ దగ్ధమయ్యాయి. తయారు చేసిన సిమెంట్ ఒరలు కూడా కాలిపోయాయి. టీడీపీ నేతలు నిత్యావసర వస్తువులతో పాటు రూ.5 వేల నగదును అందచేశారు.

ప్రజల అవసరాలు తీరుస్తున్న కూటమి ప్రభుత్వం

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ


నకరికల్లులో ట్యాప్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నా, పక్కన నాగోతు శౌరయ్య

నకరికల్లు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన చేస్తున్నదని సీఎం చంద్రబాబునాయుడు పేదరికంలో ఉన్నవారికి చేయూతనందించి అభివృద్ధిలోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం నకరికల్లు ఇందిరమ్మ కాలనీలో రూ.9.8లక్షలతో నిర్మించిన తాగునీటి పైపులైన్ పథకాన్ని ప్రారంభించారు. ఎన్నో సంవత్సరాలుగా మంచినీటి ట్యాంకర్లపై ఆధారపడి గడపాల్సిన పరిస్థితి నుంచి రక్షిత తాగునీటిని అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటుచేయాలని కోరగా కన్నా చేస్తామని తెలిపారు. నకరికల్లు-2 రైతు భరోసా కేంద్రంలో మహిళలకు కుట్టుమిషన్‌ల శిక్షణా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మహిళలందరూ టైలరింగ్ నేర్చుకోవాలని కోరారు. శిక్షణ పూర్తయినవారికి ప్రభు త్వం కుట్టుమిషన్‌లు అందిస్తున్నట్టు ఆయన తెలిపారు. జగన్ రాష్ట్రాన్ని నాశ నం చేస్తే చంద్రబాబు రాష్ట్రాన్ని గాడిలో పెట్టడంతో పాటు అభివృద్ధి, సంక్షేమా న్ని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో కుటుంబ సాధికార సర్వే గురించి మాట్లాడుతూ నకరికల్లు మండలం 92 శాతం ఉండటం పట్ల పార్టీ శ్రేణులను అభినందించారు.

ప్రధాని మోదీ సభను విజయవంతం చేయండి

ప్రధాని నరేంద్రమోడీ సభను విజయవంతం చేయాలని కన్నా లక్ష్మీనారాయణ పార్టీ శ్రేణులకు సూచించారు. నకరికల్లు మండలానికి 20 బస్సులను ఏర్పాటుచేస్తున్నారని, ప్రతి బస్సుకు ఇన్‌చార్జ్‌ను నియమించాలని మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులకు సక్రమంగా తీసుకువెళ్ళి తెచ్చేలా చూడాలని ఎంపీడీవో జీ కాశయ్యకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య, సాగి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ జె హరీష్, షేక్ అలీ బాషా, తిరుమలశెట్టి వెంకటరావు, డీఎల్‌డీవో వై రాజగోపాల్, ఎంపీడీవో జీ కాశయ్య, కాసర్ల నాగ దుర్గా, ఉమ్మారెడ్డి విజయ కుమారి, పీ శివలత తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక

సత్తెనపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ప్రజావేదికలో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు కన్నాకు వినతిపత్రం అందించారు. అర్జీలను పరిశీలించిన కన్నా ప్రాధాన్యత క్రమంలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. నియోజకవర్గంలో ప్రజల సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేస్తామన్నారు.

ప్రారంభమైన శ్రీఅంకమ్మ తల్లి కొలుపులు


శ్రీఅంకమ్మ తల్లి కొలుపులకు పసుపు కుంకుమలతో తరలివచ్చిన మహిళలు

దాచేపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలోని శ్రీవీర్లంకమ్మ తల్లి కొలుపులు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు దేవాలయంలో మహిళలు పసుపు, కుంకుమలతో, మేళతాళాలు, పసుపు, కుంకుమలు అమ్మవారికి అందించారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఐదు రోజుల పాటు ఈ కొలుపులు నిర్వహించనున్నారు.

ఉత్సాహంగా ప్రారంభమైన ఎడ్ల పోటీలు

దాచేపల్లిలోని శ్రీవీర్లంకమ్మ తల్లి 25వ వార్షిక కొలుపులను పురస్కరించుకొని చేపట్టిన రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శనలో భాగంగా తొలిరోజు పాలపళ్ళ ఎడ్లపోటీలు ప్రారంభించారు. శుక్రవారం దాచేపల్లిలోని శ్రీవీర్లంకమ్మతల్లి ఆల య ప్రాంగణం పక్కనే ఉన్న ప్రత్యేక కోర్టులో పోటీలను చేపట్టారు. పోటీలకు 15 ఎడ్లజతలు పాల్గొన్నాయి. పోటీలను చూసేందుకు రైతులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. శనివారం జతపళ్ళ ఎడ్లజత పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కూటమి నేతలు హాజరై ఎడ్లపోటీలను ప్రారంభించారు.

డీఎంకు ఎంప్లాయీస్ యూనియన్ నేతల వినతి

సత్తెనపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సత్తెనపల్లి ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎన్‌బీకే సాహెబ్, కార్యదర్శి డీ భాస్కరరావు, కోశాధికారి ఎస్ జవహర్, హుస్సేన్ సాహెబ్, ఎస్ రాంబాబులు డీఎంకు వినతిపత్రం అందించారు. డిపోలో చార్టులను డిజిటల్ విధానంలో వెంటనే పూరించాలని, ఏడీసీల షఫ్లింగ్ వెంటనే చేపట్టాలని, వెహికల్ కండిషన్ మెరుగు పరచాలని, పలకలూరు, గుంటూరు సర్వీసులు రూటులో సర్వే చేసి సరైన సమయాలు కేటాయించాలన్నారు.

సమగ్ర సర్వే


సత్తెనపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి పురపాలకసంఘ పరిధిలో ఉన్న పొడిచెత్తను సేకరించే అసంఘటిత రంగ కార్మికుల వ్యక్తిగత వివరాలు, వారి సామర్థ్యాల అంచనా కోసం సమగ్ర సర్వే నిర్వహించనున్నట్టు మునిసిపల్ కమిషనర్ ఎం ఆనంద్‌కుమార్ శనివారం తెలిపారు. నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టమ్ పథకం ద్వారా తడి, పొడిచెత్తను సేకరించే కార్మికులకు గుర్తింపుకార్డులు ఇచ్చి సామాజిక భద్రత, ఆర్థికాభివృద్ధి, ఆరోగ్య ప్రయోజనాలు, నైపుణ్యం మెరుగుదలకు తగిన శిక్షణ ఇస్తామన్నారు. నమస్తే పథకం పేరిట ఎన్యూమరేషన్ నిర్వహించేందుకు ఒక యాప్‌ను రూపొందించామన్నారు. సత్తెనపల్లి పట్టణంలో పథకం నోడల్ అధికారి విజయసారథి ఆధ్వర్యంలో సర్వే కొనసాగుతుంది. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కో-ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప పాల్గొన్నారు.

పది ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం

నకరికల్లు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో నకరికల్లు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రథమ స్థానం పొందిన గంజనబోయిన రాధిక(590), ద్వితీయస్థానం పొందిన ఎన్.శ్రీనిజ(585), తృతీయస్థానం పొందిన వీ వెన్నెల(583)ను ఎంఈవో-2 ఎంఎల్ఎన్ ప్రసాదు సత్కరించారు. కార్యక్రమంలో నకరికల్లు హెచ్ఎం టీ నగేష్, తల్లిదండ్రులు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.


నకరికల్లులో 10వ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానిస్తున్న అధికారులు

..ఆ చెట్టు నీడన




భానుడు భగభగ మండినా..చల్లని ప్రేమను మానుకోలేదు

చల్లని పల్లెగాలి.. నీడనిచ్చే ఈ చెట్ల వద్దకు రాగానే.. కాసేపు సేద తీరాలి అనే కోరిక కలుగుతుంది. గ్రామాలు, పట్టణాల్లోని కొన్ని చెట్లు చరిత్ర పుటల్లో నిలిచి.. ఆయా ప్రాంతాలకు ప్రత్యేక ఆనందాన్ని ఇస్తున్నాయి. వాటిలో ఒక్కో చెట్టుకు ఒక్కో చరిత్ర. వాటి స్థితిగతులను బట్టి దశాబ్దాలుగా వాటిని ప్రత్యేక పేర్లతో పిలుస్తున్నారు. మన పూర్వీకులు నాటిన మొక్కలే నేడు మానులైన గ్రామ, పట్టణ చరిత్రలో పేరుగాంచాయి.

చెట్టు పేరుమీదే సెంటర్లు

పెదకూరపాడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెదకూరపాడు మహాలక్ష్మమ్మ చెట్టు సెంటర్, జెండా చెట్టు సెంటర్లు ఫేమస్. ఈ రెండు సెంటర్లలో ఉన్న అరుగులపై ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలు కూర్చుని ముచ్చట్లు పెట్టుకుంటారు. గారపాడు గ్రామంలోని జెండా చెట్టు సెంటర్ కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ చెట్ల వద్ద ఆయా గ్రామాల ప్రజలు ఎండలకు సేద తీరుతారు.

అందమైన అనుబంధం



చీరాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : చీరాల నుండి వేటపాలెం వెళ్లే ప్రధాన రహదారిలో బ్రహ్మంగారి చెట్టు ఉంది. ఇక్కడ ఈ ఆలయం వెలసి సుమారు 300 ఏళ్లు కాగా, సుమారు 80 సంవత్సరాల క్రితం స్థానికులు ఆలయానికి ఆనుకుని ఓ రాగి మొక్కను నాటారు. అనంతరం మహా వృక్షంగా బ్రహ్మంగారి చెట్టు అని పిలిచేలా రూపాంతరం చెందింది. అలాగే పేరాల ముత్యాలమ్మ పేటలో వేంచేసియున్న మహాలక్ష్మమ్మ చెట్టు సుమారు 50 ఏళ్ల క్రితం ఏర్పడింది. స్థానికులు, ప్రయాణికులు ఈ చెట్టు నీడలో సేద తీరుతున్నారు.

- మండు వేసవిలో చల్లటి నీడనిస్తున్న వృక్షాలు
- ఒక్కో చెట్టుకు ఒక్కో చరిత్ర.. వాటి పేరు మీదే సెంటర్ల ఏర్పాటు
- సేద తీరేందుకు, రచ్చబండకు, చిరు వ్యాపారాలకు అవే వేదికలు

బాటసారులు సేదతీరే జమ్మిచెట్టు



కొల్లూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఈ జమ్మి చెట్టు వద్ద పూర్వకాలం నుంచి బాటసారులు సేద తీరుతున్నారు. కొల్లూరు నడిబొడ్డులో అనంత భోగేశ్వర స్వామి, పార్వతీ అమ్మవార్ల దేవస్థానాల ఆధ్వర్యంలో జమ్మి చెట్టును నాటారు. అప్పటి నుండి బాటసారులకు ఆ చెట్టు నీడ కల్పిస్తోంది. దాతలు బాటసారులు కూర్చునేందుకు చెట్టు చుట్టూ పెద్ద అరుగు నిర్మాణం చేశారు. దసరా ఉత్సవాల్లో పార్వతీ అమ్మవారికి జమ్మిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు.

వందల ఏళ్లుగా నీడనిస్తూ..



దాచేపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వందల సంవత్సరాల నుంచి గ్రామస్థులకు నీడనిస్తున్న.. ఈ రావి చెట్టును చూస్తే గ్రామస్తులకు ఎన్నో మధుర జ్ఞాపకాలు గుర్తుకొస్తాయి. అప్పటి గ్రామ పెద్దలుగా ఉన్న కరణం, మునుసుబులు ఈ చెట్టు నీడన కూర్చొని గ్రామస్తుల చిన్న చిన్న తగాదాలను, వివాదాలను పరిష్కరించేవారు. కేసానుపల్లిలోని రావి చెట్టు అంటే ఆ గ్రామస్తులకు ఎంతో మక్కువ. చెట్టు నీడలో గ్రామస్తులు విశ్రాంతి తీసుకుంటారు.

ప్రత్యేక గుర్తింపు



అద్దంకి, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): అద్దంకిలో రెండు ప్రాంతాలకు ఆ చెట్ల పేర్లతోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఒకటి హిందువులు భక్తిశ్రద్ధలతో కొలిచే మహాలక్ష్మమ్మ చెట్టు కాగా, మరొకటి ముస్లింలు పవిత్రంగా భావించే జెండా చెట్టు కావడం విశేషం. అద్దంకి పట్టణంలోని గుంజివారిపాలెంలో తరతరాల క్రితం మహాలక్ష్మమ్మ చెట్టు ఉంది. దశాబ్ద కాలం క్రితం చెట్టు ఉన్న ప్రాంతంలోనే మహాలక్ష్మమ్మ విగ్రహం ఏర్పాటు చేసి మహాలక్ష్మమ్మ దేవాలయం నిర్మించారు. ఇక భవాని సెంటర్ సమీపంలో ఉన్న దూదేకులపాలెంలో ఉన్న వేప చెట్టు.. జెండా చెట్టుగా గుర్తింపు పొందింది. సుమారు శతాబ్ద కంటే ముందు నుండే జెండా చెట్టు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

బాపట్ల నడిబొడ్డున మహాలక్ష్మీఅమ్మవారి చెట్టు



బాపట్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బాపట్ల చరిత్రకు చిహ్నమైన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరభావన్నారాయణస్వామి దేవాలయానికి సమీపంలో నాలుగు రోడ్ల కూడలిలో శతాబ్దకాలానికి పైగా వెలిసిన శ్రీమహాలక్ష్మీ అమ్మవారి చెట్టు భక్తుల కోర్కెలు తీరుస్తోంది. నాలుగు దేవాలయాలకు మధ్యలో నాలుగు రోడ్ల కూడలి వద్ద మహాలక్ష్మీ అమ్మవారి చెట్టు ప్రసిద్ధిగాంచింది. నూతన వధూవరులు ఇక్కడకు వచ్చి పూజలు చేస్తారు. బాపట్ల గడియార స్తంభం దగ్గర ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ చెట్టు దగ్గర నిత్యం వందలాది మంది వలస కూలీలు పనుల కోసం వచ్చి చెట్టు నీడన నిలబడి సేద తీరుతారు. కూలీలు కావాల్సిన వారు ఈ చెట్టు దగ్గరకొచ్చి మాట్లాడుకొని తీసుకెళ్తారు. ట్రాఫిక్ పోలీసులు కూడా ఈ చెట్టు నీడన ఉండి పర్యవేక్షిస్తుంటారు.

చిలకలూరిపేటలో మహా వృక్షాలు



చిలకలూరిపేట ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : చిలకలూరిపేటలో వందల సంవత్సరాల చరిత్ర ఉన్న మహా వృక్షాలు పలు చోట్ల ఉన్నాయి. స్థానిక గడియార స్తంభం వద్ద నుంచి ఓగేరు వాగుకువెళ్లే బ్రహ్మంగారి గుడి రోడ్డులో వందల సంవత్సరాల నాటి రాగి, మర్రి, వేప చెట్లు ఉన్నాయి. ఈ చెట్ల వద్దకు వెళ్లి పూజలు చేసే ఆనవాయితీ దశాబ్దాల తరబడి కొనసాగుతోంది. 300 సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ మహావృక్షం 2022 లో మోడుబారిపోయింది. దీంతో స్థానికులు కడియం నుంచి మూడు సంవత్సరాల వయస్సు ఉన్న వేప చెట్టును మూడేళ్ల క్రితం తీసుకువచ్చి శాస్త్రోక్తంగా నాటారు. ఇందుకు సంబంధించిన శిలాఫలకాన్ని కూడా ఆ చెట్టు వద్ద ఏర్పాటు చేశారు. చీరాల రోడ్డు లోనే 200 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉన్న వెంకటేశ్వర స్వామి చెట్టు (చింత చెట్టు) కూడా ఉంది. ఈ చెట్టు వద్ద శంకు చక్ర నామాలు ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. పండరీపురంలో ఆరవ లైన్ లో ఉన్న వేప చెట్టు కూడా ఎంతో ప్రాముఖ్యత కలిగీ ఉంది. ఇక్కడ పెళ్లిళ్ల సమయంలో దేవుడుకు ఎదురు నడిచే ఆనవాయితీ ఎన్నో దశాబ్దాలుగా కొనసాగుతున్నది.

మండు వేసవిలో అక్కున చేర్చుకుంటూ...



రేపల్లె, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వేసవి తాపానికి అల్లాడిపోయే ప్రజలను.. చల్లటి గాలి వీస్తూ.. తన నీడలో అక్కును చేర్చుకుంటుంది ఈ చెట్టు. దీని చరిత్ర ఆరు దశాబ్దాలకు పైమాటే.. రేపల్లె పట్టణంలోని ఓల్డ్ టౌన్‌లో ఉన్న ఈ వృక్షాన్ని అంకమ్మ చెట్టుగా పిలుస్తారు. ఏటా పాతపట్నంలోని ప్రజలు ఈ చెట్టుకు కొలుపులు కొలుస్తూ సద్ది నైవేద్యాలు సమర్పిస్తూ దేవతా మూర్తిగా కొలుస్తారు. ప్రయాణికులు అంకమ్మ చెట్టు నీడలో సేద తీరుతుంటారు. పాత పట్నం వాసులు సాయంత్రం 4 నుండి 7గంటల వరకు ఈ చెట్టు నీడనే వివిధ రకాల సమావేశాలు నిర్వహించుకుంటూ ఉంటారు. మండలంలోని పేటేరు గ్రామంలో సీతామహాలక్ష్మీ చెట్టు పేరొందింది. పలువురికి నీడనిస్తూ రచ్చబండగా మారింది. ఈ వృక్షం వయస్సు.. సుమారు 60 ఏళ్లు పైమాటే.. ఐదేళ్ల క్రితం ఈదురుగాలులకు పెద్దకొమ్మలు విరిగిపోయాయని.. లేకుంటే ఇంకా నీడగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.



ఐదు దశాబ్దాలకు పైగా ఆదరణ

తెనాలి అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : తెనాలి నాజరుపేటలోని మహాలక్ష్మమ్మ చెట్టు సెంటర్. ఐదు దశాబ్దాలకు పైగా ఈ కూడలి జనాదరణ పొందింది. ఆ ప్రాంతంలోని వారంతా ఉదయం, సాయంత్రం అక్కడ చేరి ఆనందంగా కబుర్లు చెప్పుకుంటూ గడిపేవారు. పూర్వీకులు ముఖ్యమైన ప్రాంతాల్లో చెట్లు నాటి ఆలయాన్ని నిర్మించి అక్కడ చేరి మాట్లాడుకునేవారు. కాలం మారిపోవడంతో నాటి ప్రాముఖ్యత ప్రస్తుతం తగ్గిపోయింది. ఆ ప్రాంతాలను చూసిన వృద్ధులకు ఇప్పటికీ నాటి ఊసులు గుర్తు చేసుకుంటూ.. ఆనందంతో చెప్పుకుంటారు.

తరాల నాటి వేపచెట్టు



పర్చూరు బొమ్మల సెంటర్ కూడలిలో తరాల నాటి వేపచెట్టు ప్రయాణికులకు, ప్రజలకు సేద తీర్చేందుకు నిలయంగా మారింది. మండుటెండలో విలవిల్లాడుతున్న వారు ఈ వేపచెట్టు నీడ కిందుకు చేరుకొని సేద తీరుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు.. రద్దీగా ఉండే బొమ్మల సెంటర్ కూడలిలో కనీసం ఒక్క బస్సు షెల్టర్‌కూడా లేకపోవడంతో ఈ వేప చెట్టు కిందనే వేచి ఉండి ఆయా మార్గాలకు ప్రయాణిస్తున్నారు. చిరువ్యాపారులు కూడా ఇదే చెట్టును ఆవాసంగా చేసుకొని వ్యాపారాలు సాగిస్తుంటారు.

- పర్చూరు, ఆంధ్రజ్యోతి

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో..

● కీబోర్డు వాయిద్యంలో పలువురికి చోటు



సర్టిఫికెట్ అందుకుంటున్న మణిదీప్తి

మాచవరం, రేపల్లె, తుళ్లూరు ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో మాచవరం మండలం మోర్జంపాడు గ్రామ సచివాలయంలో వ్యవసాయ సహాయకురాలుగా విధులు నిర్వహిస్తున్న గారపాటి మణిదీప్తి చోటు సంపాదించింది. డిసెంబరు 1, 2024లో హల్లెల్ మ్యూజిక్ స్కూల్ విజయవాడ వ్యవస్థాపకులు ఫాస్టర్ అగస్టీన్ దండిగి ఆధ్వర్యంలో సంగీత వాయిద్య ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో 18 దేశాల నుంచి 1,100 మంది సంగీత కళాకారులు పాల్గొని ఆన్‌లైన్‌లో గంట పాటు సరళి స్వరాలను కీ బోర్డుపై ఆలపించి ఆ వీడియోలను ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేసి ఈ ఘనత సాధించినట్టు మణిదీప్తి తెలిపారు. 1,100 మంది పాల్గొనగా 1,046 మంది ఈ రికార్డుకు ఎంపికైనట్టు తెలియ జేశారు. ఈ సందర్భంగా శుక్రవారం విజయవాడలో ఫాస్టర్ దిండిగి చేతుల మీదుగా మణిదీప్తి ఈ అవార్డును అందుకున్నారు.



సర్టిఫికెట్ అందుకుంటున్న అమూల్య

ఆలా అమూల్య...

రేపల్లె పట్టణంలోని 5వ వార్డుకు చెందిన చిన్నారి ఆలా అమూల్య మ్యూజికల్ కీబోర్డు ఇన్‌స్ట్రుమెంట్‌లో ప్రతిభ కనబరిచి గిన్నిస్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించింది. పట్టణానికి చెందిన ఆలామోషే, లావణ్య వారాల రెండో కుమార్తె ఆలా ఆమూల్య. నేతాజీ మున్సిపల్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో విద్యను అభ్యసిస్తోంది.



సర్టిఫికెట్ అందుకుంటున్న సంవేద్ బాబు

సంవేద్ బాబు..

తూళ్లూరు మండలంలోని రాజధాని గ్రామం బోరుపాలెం బుడ్డోడు సంవేద్‌బాబు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం లభించింది. 50 సెకన్ల వ్యవధిలో సరళి స్వరాలను స్పష్టంగా అత్యంత వేగంగా పలికించినందుకు గాను గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. సంవేద్ బాబుకి మెడల్, సరిఫికెట్ ప్రదానం చేశారు. గతంలో ఇంజినీయెస్ వరల్డ్ రికార్డులో సంవేద్ బాబు స్థానం సంపాదించాడు. గత ఎన్నికల్లో తాడికొండ నియోజకవర్గం నుంచి టీడీపీ తరుఫున ఎమ్మెల్యే టికెట్ ఆశించిన తోకల రాజవర్ధన్ కుమారుడే సంవేద్‌బాబు. 8వ తరగతి చదవుతున్నాడు.


ఉత్సాహంగా కేంద్రీయ విద్యాలయం బాలికల కబడ్డీ పోటీలు



సర్టిఫికెట్లతో బాలికల కబడ్డీ జట్టు

గుంటూరు (విద్య)ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): నల్లపాడు లోని కేంద్రీయ విద్యాలయంలో శుక్రవారం అండర్-14 బాలికల కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ కేంద్రీయ విద్యాలయాల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ ఎస్.విజయ్ కుమార్, హెచ్‌ఎం ఎస్.ఆనంద్, పీఈటీ అంజలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తిరుపతి షిఫ్ట్- 1 ప్రథమ బహుమతి తిరుపతి షిఫ్ట్ 2 ద్వితీయ బహుమతి, గుంటూరు షిఫ్ట్ 1 జట్టు ప్రత్యేక బహుమతులు అందుకున్నాయి. సర్టిఫికెట్లు పథకాలు అందజేశారు.

తల్లిదండ్రులతో సివిల్స్ విజేత చల్లా పవన్ కల్యాణ్



పత్రికా పఠనం వల్లే సివిల్స్‌పై ఆసక్తి

యూపీఎస్సీ 146 ర్యాంకర్ చల్లా పవన్ కల్యాణ్

గుంటూరు సిటీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): 'చిన్నప్పటి నుంచి నాన్న (చల్లా రమేష్) ప్రభావం నా మీద ఎక్కువగా ఉండేది. పేపర్లు చదవడం కూడా అలానే అలవాటు అయ్యింది. పత్రికా పఠనం వల్లే పొలిటికల్ సైన్స్‌పై ఆసక్తి పెరిగి సివిల్స్ వైపు వెళ్లేలా చేసింది. సాఫ్ట్వేర్ ఉద్యోగం క్యాంపస్‌లోనే వచ్చింది. ఆ ఉద్యోగం చేస్తే.. నేను స్థిరపడతాను. కానీ, ప్రజలకు సేవ చేయాలని చిన్నప్పటి నుంచి కన్న కలలు నిజం కావు. అందుకోసమే ఆ ఉద్యోగం వద్దని సివిల్స్ కోసం కష్టపడ్డాను.' అని యూపీఎస్సీ 146 ర్యాంకర్ చల్లా పవన్ కల్యాణ్ అంటున్నారు. సివిల్స్ ఫలితాలు వెలువడిన తర్వాత ఆయన 'ఆంధ్రజ్యోతి' తో ప్రత్యేకంగా మాట్లాడారు. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం రుద్రవరం గ్రామానికి చెందిన పవన్ ప్రాథమిక విద్యను గుంటూరులోనే పూర్తిచేశారు.

వెంకటేశ్వర బాలకుటీర్‌లో క్రమశిక్షణ..

గుంటూరులోని వేంకటేశ్వర బాలకుటీర్‌లోనే పదో తరగతి వరకు చదివాను. అక్కడ క్రమశిక్షణ.. దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాలు మనసులో చెరిగిపోని ముద్ర వేశాయి. తిరుచ్చిలో బీటెక్ పూర్తి చేస్తున్న సమయంలో అమెరికా బేస్ ఉన్న సంస్థలో సాఫ్ట్వేర్ ఉద్యోగం వచ్చింది. కానీ, ఆ ఉద్యోగంలో చేరడం నాకు ఇష్టం లేదు.

ముచ్చటగా మూడోసారి

ప్రజలకు సేవ చేయాలంటే కచ్చితంగా సివిల్ సర్వీస్‌కు వెళ్లాల్సిందేనని నిర్ణయించుకున్నాను. 2020 నుంచి సిద్ధమవుతున్నాను. మొదటి ప్రయత్నంలోనే ప్రిలిమ్స్ క్వాలిఫై అయ్యాను. రెండవ ప్రయత్నంలో మెయిన్స్ క్లియర్ చేశారు. కానీ, ఇంటర్వ్యూ పోయింది. మూడోవ ప్రయత్నంలో 146 ర్యాంకు వచ్చింది.

స్మార్ట్ వర్క్ తప్పనిసరి

సివిల్స్‌లో విజయం సాధించాలంటే హార్డ్ వర్క్‌తో పాటు.. స్మార్ట్ వర్క్ కూడా ఖచ్చితంగా తెలిసి ఉండాలి. ఏది ఎంత వరకు చదవాలో.. అంత వరకే చదవాలి. ఏది ఎప్పుడు చదవాలో అప్పుడే చదవాలి. నేను కూడా ఇదే పద్ధతిని అవలంబించాను. పరీక్షలు దూరంగా ఉన్నప్పుడు రోజుకు మూడు నుంచి నాలుగు గంటలు చదివే వాడిని. పరీక్షలు దగ్గరికి వచ్చే కొలదీ రోజుకు 7 నుండి 10 గంటల వరకు చదివే వాడిని. కొంతమంది సీనియర్లు సలహాలు సూచనలు కూడా తీసుకొని ముందుకు వెళ్లాను. ఇప్పటికే సర్వీసులో ఉన్న వారిని కూడా కలిసి.. కొన్ని సూచనలు, మెళకువలు నేర్చుకుని నా ప్రయత్నానికి మెరుగులు దిద్దుకున్నాను.

చివరి ప్రశ్న మరిచిపోలేనిది

ఇంటర్వ్యూలో నన్ను అడిగిన చివరి ప్రశ్న ఎప్పటికీ మరచిపోను. నాకు భౌగోళిక చిత్రాలను గుర్తించడం అలవాటు అని దరఖాస్తులో పేర్కొన్నాను. అంటే ఏదైనా ఒక ప్రాంతానికి చెందిన ఫొటోను చూసి.. అది ఏ ప్రాంతమో గుర్తించడం అన్న మాట. ఇంటర్వ్యూలో నాకు ఒక ఫొటో చూపించి ఇది ఎక్కడిదో చెప్పమన్నారు. అది కొచ్చి లోనిది కాబట్టి అదే సమాధానం చెప్పా. ఇంటర్వ్యూ చేసే వాళ్లు కూడా ఆ సమాధానం విని కొంత ఆశ్చర్యానికి లోనయ్యారు.

పత్రికల పఠనంతో విషయ పరిజ్ఞానం

అందరికీ వెంటనే విజయం వరిస్తుందని చెప్పలేం. ఒకటికి రెండు సార్లు సివిల్స్ ప్రయత్నించే వాళ్లు.. ఏదో ఒక ఉద్యోగం చేస్తూ పరీక్షలకు హాజరు కావడం మంచిది. దానివల్ల తల్లిదండ్రులపై పెద్దగా భారం పడకుండా ఉంటుంది. పత్రికలు చదవడం వల్ల కూడా చాలా విషయ పరిజ్ఞానం పెరుగుతుంది.

ప్రజలకు వీలైనంత సేవ చేస్తా

ఏ లక్ష్యంతో అయితే సివిల్స్‌కి వెళ్లాలని అనుకున్నానో అదే లక్ష్యంతో ముందుకు వెళ్తాను. చిన్నప్పటి నుంచి గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పరిస్థితి పూర్తిగా చూశాను కాబట్టి ప్రజలకు ఎంతవరకు సేవ చేసే అవకాశం ఉంటే అంత వరకు సేవ చేస్తాను.

సీఐటీయూ క్రికెట్ టోర్నీ ప్రారంభం

- మేడే సాంస్కృతిక, క్రీడా వారోత్సవాలను జయప్రదం చేయండి
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు

పెదకాకాని, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మే డే సందర్భంగా ఉద్యోగ, కార్మికుల క్రీడా సాంస్కృతి వారోత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సీఐటీయూ గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ సీఐటీయూ రాష్ట్రవ్యాప్తంగా మే డే సందర్భంగా క్రీడా సాంస్కృతి వారోత్సవాలు నిర్వహిస్తుందని తెలిపారు. అందులో భాగంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. మే 20న జరగనున్న జాతీయ సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. 8 గంటల పని విధానం, సమ్మె డిమాండ్లను ప్రచారం చేయడం కోసం మే డే వారోత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా సీఐటీయూ నిర్వహిస్తుందన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.లక్ష్మణరావు, దండా లక్ష్మీనారాయణ, గుంటూరు నగర ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, యూనివర్సిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, ఎస్‌ఎఫ్‌ఐ యూనివర్సిటీ అధ్యక్షుడు కె.రూఫస్ పాల్గొన్నారు. మొదటి రోజు జరిగిన మ్యాచ్‌లో గుంటూరు మిర్చి కింగ్స్‌పై రాజు ఏఎన్యూ టీం విజయం సాధించింది. రెండవ మ్యాచ్ జీఎంసీ వారియర్స్ వర్సెస్ సీఆర్‌డీఏ సర్కిల్ ఎలక్ట్రిసిటీ మధ్య జరిగింది.

సమాజ శ్రేయస్సుకే మానవ మేధస్సు

● విశ్రాంత ఐఐఎస్ అధికారి డాక్టర్ జి.కొండలరావు



డాక్టర్ జి.కొండలరావుకు సన్మానం

పెదకాకాని, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మానవ మేధస్సును సమాజ శ్రేయస్సుకే వినియోగించాలని ఆంధ్రప్రదేశ్ దూరదర్శన్ వార్తా పూర్వ విభాగాధిపతి డాక్టర్ జి.కొండలరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కామర్స్ బిజినెస్ మేనేజ్‌మెంట్, జర్నలిజం విభాగాల ఆధ్వర్యంలో గుంటూర యునెస్కో క్లబ్ సమన్వయంతో 'సాంకేతిక యుగంలో విద్యార్థుల బాధ్యత' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న విశ్రాంత ఐఏఎస్ అధికారి కొండలరావు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక మాధ్యమాల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు అధ్యాపకుల సలహాలు, సూచనలతో తమ భవిష్యత్తును ఉత్తమమైన జీవన విధానంగా మలుచుకోవాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యఅతిథి ఏఎన్‌యూ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు తమ కాలం నాటి విద్యా వ్యవస్థ, నేటితరం విద్యా విధానాల మధ్య వ్యత్యాసాలను వివరించారు. గౌరవ అతిథి, వర్సిటీ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, సదస్సు సంచాలకులు కామర్స్ బిజినెస్ మేనేజ్‌మెంట్ డీన్ ఆచార్య రామినేని శివరామప్రసాద్, పాత్రికేయ విద్యా విభాగాధిపతి ఆచార్య కె.జ్యోతిర్మయి పాల్గొన్నారు. డాక్టర్ జి.కొండలరావును ఏఎన్‌యూ ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు, అతిథులు, యునెస్కో గ్రూప్ గుంటూరు క్లబ్ నిర్వాహకులు పరమేశ్వరరావు సన్మానించారు. విద్యార్థులకు ధ్రువపత్రాలు ప్రదానం చేశారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఇంటర్ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

రొంపిచర్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెంలోని పీఎంశ్రీ ఏపీ మోడల్ పాఠశాల, జూనియర్ కళాశాలలో రాబోయే విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ బీ రవినాయక్ శుక్రవారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సుల్లో ఇంగ్లీషు మీడియంలో చదువుకునేందుకు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 10వ తరగతి పరీక్ష పాసైన వారు అర్హులన్నారు. వచ్చిన మార్కులను బట్టి, ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు సీట్లు కేటాయిస్తారన్నారు.

37వ రోజుకు చేరిన పారిశుధ్య కార్మికుల సమ్మె

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారంతో 37వ రోజుకు చేరుకుంది. పనిచేసిన అన్ని దినాలకు ఆప్కాస్ ద్వారా వేతనాలు ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సిలార్ మసూద్ డిమాండ్ చేశారు.

ఎస్సీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

వినుకొండ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): 2025-26 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎస్సీ లబ్ధిదారులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్ర బోస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన లబ్ధిదారుల నుంచి మే నెల 10వ తేదీ లోపు రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. లబ్ధిదారులకు తెల్ల రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, మీసేవ ద్వారా తీసుకున్న కుల ధ్రువీకరణ, విద్యార్హత పత్రాలు తదితర కాపీలతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

యువకుడికి గాయాలు

యడ్లపాడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీకొని ద్విచక్రవాహనం నడుపుతున్న యువకుడు గాయపడిన ఘటన పదహారో నంబరు జాతీయ రహదారిపై జరిగింది. ఎస్ఐ శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం పాతమల్లయ్యపాలెంకు చెందిన యువకుడు ప్రశాంత్ ద్విచక్రవాహనంపై గుంటూరుకు బయలుదేరాడు. యడ్లపాడు ఎన్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ ద్విచక్రవాహనంను అధిగమించి ఎడమవైపు సర్వీసు రోడ్డువైపునకు వేగంగా తిప్పటంతో ద్విచక్ర వాహనంకు తగిలి ప్రశాంత్ రోడ్డుపై పడి గాయపడ్డాడు. అతనిని చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఫలితాలపై విద్యార్థుల ప్రచారం

రొంపిచర్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల జడ్పీ పాఠశాల 10వ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. 98.31 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు హెచ్ఎం బీఎం సుభానీ శుక్రవారం తెలిపారు. పాఠశాల విద్యార్థి సాయిలక్ష్మి 581 మార్కులు, శ్రీవిద్య 579, గోపాల కృష్ణమాచారి 578 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల ఫొటోలతో కరపత్రాలను ముద్రించారు. వాటిని గ్రామాల్లో పంపిణీ చేశారు.

రేపు కంటి వైద్యశిబిరం

వినుకొండ టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27వ తేదీన నరసరావుపేట రోడ్డులోని గంగినేని ఫంక్షన్ హాల్ నందు శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ మేనేజర్ రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరానికి వచ్చే రోగులు తప్పనిసరిగా తెల్లరేషన్ కార్డు, ఆధార్ జిరాక్స్ కాపీలను తెచ్చుకోవాలన్నారు.

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలకు యూజీసీ న్యూఢిల్లీ అటానమస్ గుర్తింపు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలకు యూజీసీ న్యూఢిల్లీ అటానమస్ గుర్తింపు లభించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు శుక్రవారం తెలిపారు. కళాశాల చైర్మన్ షేక్ మీరావలి మాట్లాడుతూ కళాశాలకు అటానమస్ గుర్తింపు రావడంతో మా బాధ్యత మరింత పెరిగిందన్నారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, ఎండీ డాక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్‌లు విద్యార్థుల సమక్షంలో కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎంరెడ్డి ఇంజనీరింగ్‌లో డిప్లమో విద్యార్థుల ఫేర్‌వెల్

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెట్లూరివారిపాలెంలోని ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలోని డిప్లమో విద్యార్థుల ఫేర్‌వెల్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. డిప్లొమో ప్రిన్సిపాల్ డాక్టర్ కే కృష్ణారెడ్డి, ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున్, అకడమిక్ డీన్ డాక్టర్ ఎ కిశోర్‌రెడ్డి పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎంఏఎం ఫార్మసీ కళాశాలకు అటానమస్ హోదా

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాలకు యూజీసీ నుంచి పది సంవత్సరాల కాలానికి స్వయంప్రతిపత్తి హోదా లభించిందని కళాశాల అధినేత ఎంఆర్ శేషగిరిరావు శుక్రవారం తెలిపారు. స్వయం ప్రతిపత్తి హోదా కలిగిన కళాశాల విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి. విద్యా, పరిశోధన రంగాలలో అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. మౌలిక సదుపాయాల మెరుగుదల, క్యాంపస్ ప్లేస్‌మెంట్లపై దృష్టి సారిస్తామని, భవిష్యత్‌లో విశ్వవిద్యాలయ హోదాను సాధించడానికి కృషి చేస్తామని కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ప్రసాదరావు పేర్కొన్నారు.




చిలకలూరిపేట కళామందిర్ సెంటర్లో ముస్లింలు, నరసరావుపేట మల్లమ్మ సెంటర్లో జనసేన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మానవహారం

దేశ సమగ్రతను దెబ్బతీసేందుకు పాక్ కుట్రలు

- మంత్రి గొట్టిపాటి రవి, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ధ్వజం
- ఉగ్రవాదుల దుశ్చర్యపై సర్వత్రా నిరసన



వినుకొండలో జరిగిన కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి, చీఫ్‌విప్ జీవీ, ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి తదితరులు

వినుకొండ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): భిన్నకులాలు, మతాలు, సంస్కృతులున్న భారతదేశం సమగ్రత, ఐక్యతను దెబ్బతీసేందుకే పాకిస్థాన్ కుట్రలకు పాల్పడుతోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ధ్వజమెత్తారు. పట్టణంలో శుక్రవారం రాత్రి జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ జనసేన ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ ప్రదర్శించారు. ప్రదర్శనలో పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. శివయ్య స్థూపం సెంటర్‌లో మానవహారం ఏర్పాటుచేసి నిరసన తెలిపారు. భారీ సంఖ్యలో పట్టణవాసులు పాల్గొని పహల్గా మృతులకు సంతాపం తెలిపారు. ఉగ్రదాడిలో అమరులైన వారికి నివాళిలర్పించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ చేసిన తప్పుకు పాకిస్థాన్ తప్పక మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. చీఫ్‌విప్ జీవీ మాట్లాడుతూ హిందువులను టార్గెట్ చేసి చంపడం హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు కొణిజేటి నాగశ్రీను రాయల్, బీజేపీ నాయకులు లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్లో అమాయక పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ స్థానిక కళామందిర్ సెంటర్‌లో స్థానిక ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం మానవహారం నిర్వహించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకుంటూ నివాళులర్పించారు. దేశ ప్రజలందరూ కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సంఘటితంగా ఐకమత్యంతో ఉండాలని, ఇందుకు తామంతా కట్టుబడి ఉంటామని ఈ సందర్భంగా మాట్లాడిన ముస్లిం సంఘాల నాయకులు చెప్పారు.

● చిలకలూరిపేట: కశ్మీర్ లో జరిగిన ఉగ్రదాడికి, కర్ణాటక సీనియర్ న్యాయవాది వైసదాశివరెడ్డిపై జరిగిన దాడికి నిరసనగా స్థానిక న్యాయవాదులు శుక్రవారం పట్టణంలోని కోర్టులలో విధులను బహిష్కరించారు. కశ్మీర్లో జరిగిన ఉగ్రదాడిని వారు ఖండించారు. కార్యక్రమంలో జీవిహెచ్ఎస్ ప్రసాద్, వై శ్రీనివాసరావు, పి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చిలకలూరిపేటలో జరిగిన కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, కూటమి పార్టీల నాయకులు

● వినుకొండ: ఇటీవల కశ్మీర్‌లో యాత్రికులపై ఉగ్రవాదులు జరిపిన దాడికి నిరసనగా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ మనమందరం అప్రమత్తంగా ఐక్యంగా సహనంతో ఉండాలన్నారు. ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ వాసవి క్లబ్ వినుకొండ ఆధ్వర్యంలో పట్టణంలోని శివయ్య స్థూపం సెంటర్‌లో గురువారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ అధ్యక్షుడు కాసుల వెంకటరవీంద్ర, ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఖజ్జాయం విజయలక్ష్మి, జిల్లా వైస్ గవర్నర్ గజవల్లి నాగపవన్‌కుమార్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ జీవీఎల్ నాగేశ్వరరావు, డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జి మండవ వెంకటకిరణ్‌కుమార్, చిలంకూరి వెంకటకోటేశ్వరరావు, వనిత క్లబ్ అధ్యక్షురాలు గుడిపాటి శేషపద్మజ, వాసవి క్లబ్, వనిత క్లబ్, యూత్ క్లబ్, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: కశ్మీర్ లో ఉగ్రదాడికి నిరసనగా స్థానిక ఎన్ఆర్ టి సెంటర్‌లో జాతీయ రహదారిపై జనసేన పార్టీ చిలకలూరిపేట సమన్వయకర్త తోట రాజారమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తోట రాజారమేష్, షేక్ సుభాని, ఖాదర్ బాషా, మునీర్ హసన్, కె.శివశంకర్, లీలా కిషోర్ పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: పట్టణంలో కూటమి పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ ఆంజనేయ స్వామి దేవస్థానం నుంచి చౌత్ర సెంటర్, మెయిన్ బజార్ మీదుగా గడియార స్తంభం వరకు కొనసాగింది. కొవ్వొత్తుల ర్యాలీలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, బీజేపీ సీనియర్ నాయకులు పోట్రు పూర్ణచంద్రరావు, పరాంకుశం శ్రీనివాసరావు, టి జయరామిరెడ్డి, జనసేన నేత తోట రాజా రమేష్, టీడీపీ నేతలు నెల్లూరి సదాశివరావు, తోట బ్రహ్మాస్వాములు, ఇనగంటి జగదీష్, ఎం.మల్లిబాబు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా మూడు రోజుల సంతాప దినాలు జనసేన పార్టీ నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ ఆధ్వర్యంలో శుక్రవారం నరసరావుపేట పట్టణంలో జనసేన పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. మల్లమ్మసెంటర్‌లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు జీవీఎస్ ప్రసాద్, రొంపిచర్ల మండల అధ్యక్షుడు అచ్చుల సాంబశివరావు, ప్రోగ్రామ్ కమిటీ సభ్యుడు వి.వంశీ, ఉమ్మడి గుంటూరు జిల్లా సెక్రటరీ అండ్ స్టేట్ క్రౌడ్ ఫండింగ్ కమిటీ సభ్యుడు ఈశ్వర్, జిల్లా కార్యదర్శి దుర్గాకుమారి, పట్టణ మహిళా అధ్యక్షురాలు దాసరి శివలీల, వీర మహిళలు, జనసైనికులు, పాల్గొన్నారు.

● నరసరావుపేట లీగల్: ఉగ్రదాలను ఖండిస్తూ న్యాయవాదులు శుక్రవారం విధులకు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముక్తకంఠంతో పాకిస్తాన్ దుశ్చర్యను ఖండిస్తూ, ప్రభుత్వం వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ తీర్మానం చేశారు. అనంతరం సాయంత్రం 7:00 సమయంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘ అధ్యక్షుడు మేదరమెట్ల నాగేశ్వరరావు సీనియర్ జూనియర్ పాల్గొన్నారు.

ప్రజల సమస్యలపై అర్జీల స్వీకరణ



గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులతో కలిసి గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలపై అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో మాట్లాడారు. పట్టణంలోని చీరాల రోడ్డులో మజీమంత్రి రజిని మరిది విడదల గోపికి సంబంధించిన లేఅవుట్‌కు ఎటువంటి అనుమతులు లేవని మల్లెల శివనాగేశ్వరరావు, ఇతరులు కొంతమంది ప్రత్తిపాటికి ఫిర్యాదు చేశారు. పాఠశాలలో 25మంది విద్యార్థులు ఉన్నా, విద్యార్థులు లేరంటూ తమ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను తొలగించే ప్రయత్నంచేస్తున్నారని, పురుషోత్తమపట్నం గ్రామస్థులు తెలిపారు. సమస్యను డీఈవో దృష్టికి తీసుకెళ్లిన ప్రత్తిపాటి, గ్రామస్థుల విజ్ఞప్తిని పరిశీలించి, పాఠశాలను కొనసాగించాలని కోరారు. పట్టణంలో ఇంకా తాగునీరు సక్రమంగా అందని వార్డుల గురించి మున్సిపల్, ఆర్ డబ్ల్యూఎస్ సిబ్బందిని ప్రశ్నించారు. తాగునీటి సమస్యపై ఆయన ప్రజల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల్ని త్వరగా గుర్తించి, రుణాలు అందించాలని ప్రత్తిపాటి బ్యాంకర్లకు సూచించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తోట రాజా రమేష్, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరీముల్లా, జవ్వాజి మదన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, పఠాన్ సమద్ ఖాన్, గంగా శ్రీనివాసరావు, కందుల రమణ, మద్దిబోయిన శివ పాల్గొన్నారు.

చలివేంద్రాల ప్రారంభం

చిలకలూరిపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అడ్డరోడ్డు, కళామందిర్ సెంటర్లలో స్థానిక మున్సిపాలిటీ వారు ఏర్పాటుచేసిన మంచినీటి చలివేంద్రాలను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు, డీఈ రహీం, జనసేన నాయకులు తోట రాజారమేష్, టీడీపీ నాయకులు షేక్ కరీముల్లా, గంగా శ్రీనివాసరావు, తోట సత్యం, ఆరెకట్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లకు ప్రశంశాపత్రాలు

చిలకలూరిపేట: భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లిన 12మంది టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ లకు స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం ప్రశంసాపత్రాలు అందించారు. స్థానిక ప్రత్తిపాటి క్యాంపు కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఇన్‌చార్జ్ ల పనితీరును మెచ్చుకుని అభినందించారు. కార్యక్రమంలో మద్దిబోయిన శివ, ముల్లా కరిముల్లా, గంజి శ్రీనివాసరావు, జ్ఞాన్ రెడ్డి, మురకొండ మల్లిబాబు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించండి

చిలకలూరిపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యానవన శాఖాధికారులతో స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన ప్రభుత్వం ఉద్యానపంటలకు అందించే ప్రోత్సాహకాల గురించి తెలియచేసి, నియోజకవర్గ రైతాంగాన్ని ఆ పంటల సాగు దిశగా ప్రోత్సహించాలని, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వచ్చేలా అధికారులు ఎప్పటికప్పుడు రైతులకు శిక్షణ ఇవ్వాలని కోరారు.

పెండింగ్ కేసులను పరిష్కరించాలి

● నేర సమీక్షలో ఎస్పీ కంచి శ్రీనివాసరావు



నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నర్సరావుపేట లీగల్, ఏప్రిల్ 25, (ఆంధ్రజ్యోతి), పెండింగ్ కేసులను హేతుబద్ధంగా విశ్లేషించి తగ్గించాలని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు శనివారం కోరారు. ఎస్పీ కార్యాలయంలో పల్నాడు జిల్లా పోలీస్ అధికారులతో ఆయన శనివారం నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లను ఆశ్రయించే బాధితులతో మర్యాదుగా వ్యవహరించాలన్నారు. మహిళలు, బాలికలు, చిన్నారులకు సంబంధించి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. వారికి సంబంధించిన కేసుల విచారణ సమయంలో తప్పనిసరిగా మహిళా పోలీస్ అధికారి గాని సిబ్బంది గాని ఉండేటట్లు చూసుకోవాలన్నారు. పాత నేరస్థుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై ప్రతిరోజు దాడులు నిర్వహించాలన్నారు. పోక్సో, ఆస్తి, మిస్సింగ్, గంజాయి, నాటుసారాల కట్టడికి తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించారు. శివరాత్రి సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రదేశాలలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యల గురించి సమీక్షించారు. 112 ఎమర్జెన్సీ నెంబర్ నుంచి వచ్చే కాల్స్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రౌడీలు, సస్పెక్ట్‌లు పాత నేరస్థుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. విచారణ దశలో ఉన్న కేసులను సాంకేతిక పరిజ్ఞానాన్ని వృత్తి పరిజ్ఞానాన్ని ఉపయోగించి వేగవంతంగా దర్యాప్తుచేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేయాలన్నారు కోర్టులో విచారణ సరిగా జరిగి నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాన్నారు. ఈ నెలలో యడ్లపాడు, చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్లోని కేసులలో కోర్టు శిక్షలు విధించినట్లు తెలిపారు. శిక్షలు పడటానికి కృషిచేసిన చిలకలూరిపేట రూరల్ సీఐ, యడ్లపాడు ఎస్ఐ, చిలకలూరిపేట రూరల్ ఎస్ఐలను ఎస్పీ అభినందించారు. సమీక్షలో పరిపాలన అదనపు ఎస్పీ జేవీ సంతోష్, ఏఆర్ అదనపు ఎస్పీ వి.సత్తిబాబు, నరసరావుపేట డీఎస్పీకే నాగేశ్వరరావు సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, ఆర్ఐలు, సీఐలు, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి: ఎంపీపీ రాధిక

ఈపూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఈదర రాధిక అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ ఎండలను దృష్టిలో పెట్టుకొని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామాలలో తాగునీటి సమస్యను గుర్తించి సత్వరమే పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కె.ప్రభాకర్, జడ్పీటీసీ తుర్లపాటి చౌడయ్య, వైస్ ఎంపీపీ గోలి భాగ్యలక్ష్మి, పంచాయతీరాజ్ ఏఈ హరనాథ్, ఈవోపీఆర్‌డీ రత్నం, ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం దహనం

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతూరు ఆంజనేయస్వామి గుడి వద్ద ఇంటి వద్ద నిలిపిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేసిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. బాధితుడు పాతూరుకు చెందిన గోగుల శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం స్థానం గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఇంటి పక్కన తన ద్విచక్ర వాహనాన్ని నిలిపాననారు. నాలుగున్నర గంటల సమయంలో వాహనం కాలిపోతుండగా గమనించి మంటలను అదుపుచేశామన్నారు. బైక్ విలువ 1,30,000 తెలిపారు. ఈ మేరకు రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం

● ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం నరసరావుపేట టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ నాలుగు వారాలుగా ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇళ్ళ స్థలాల కోసం ఎక్కువగా దరఖాస్తులు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో రంగిశెట్టి రామకృష్ణ, వాసిరెడ్డి రవి, షేక్ ఖాసీమ్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే అరవింద బాబు

రొంపిచర్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురువారం తెలిపారు. మండలంలోని తురుమెళ్ళలో పల్లె నిద్ర కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొప్పోలు సాంబశివరావు మృతి చెందగా సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.4.50 లక్షల చెక్కును అతని భార్యకు అందజేశారు. కార్యక్రమంలో పి.జగ్గయ్య, జి.సురేష్, పి.నాగిరెడ్డి, మొండితోక రామారావు, కుమ్మెత కోటిరెడ్డి, మేదరమెట్ల పెద శేషగిరిరావు, మేదరమెట్ల శేషగిరిరావు, గంగవరపు పవన్, ఇంటూరి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో వ్యత్యాసాలుంటే దరఖాస్తు చేసుకోవాలి

● మండల తహసీల్దార్ అర్జున్‌నాయక్

కొత్తలూరు (శావల్యాపురం) ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో నమోదైన పొలం విస్తీర్ణాలలో వ్యత్యాసాలుంటే రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ అర్జున్‌నాయక్ తెలిపారు. మండలంలోని కొత్తలూరులోని రీసర్వేకి సంబంధించి 9(2) పత్రాలు రైతులకు అందజేసే కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. తహసీల్దార్ మాట్లాడుతూ కొత్తలూరు రెవెన్యూ పరిధిలో మొత్తం 4412.26 ఎకరాల భూవిస్తీర్ణం ఉండగా 3500ఎల్‌పీఎం నెంబర్లలో విస్తీర్ణాలను నమోదు చేశామన్నారు. కాబట్టి రైతులు 9(2)పత్రాల్లోని విస్తీర్ణాలు, గతంలోని విస్తీర్ణాలు సరి చూసుకొని వ్యత్యాసాలుంటే రీ సర్వే డీటీ వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఐదు సెంట్ల వరకు హెచ్చుతగ్గులను మాత్రం పరిగణనలోకి తీసుకోమని, అంతకంటే ఎక్కువ వ్యత్యాసాలుంటే పొలాన్ని మరోసారి కొలవడం జరుగుతుందన్నారు. మండల సర్వేయర్ రాజు, వీఆర్వో మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పదిలో సత్తా చాటిన విద్యార్థులకు అభినందన

యడ్లపాడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలలకు గర్వకారణంగా తమ విద్యార్థులు కె జయలక్ష్మి, బి ఫణీంద్రసాయిలు నిలిచారని ఉన్నవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధురిరాణి అన్నారు. శుక్రవారం మండలంలోని ఉన్నవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి టాపర్‌లుగా నిలిచి పాఠశాల విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు.



విద్యార్థులకు స్కాలర్‌షిప్ అంద జేస్తున్న చైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు

ఎన్ఈసీ విద్యార్థులకు రూ.11.25 లక్షల రీసెర్చ్ స్కాలర్ షిప్

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ, ఐటీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు అంతర్జాతీయ జర్నల్‌లో రీసెర్చ్ పేపర్లు ప్రచురించిన నేపథ్యంలో 100 మంది విద్యార్థులకు ప్రతి ఒక్కరికి రూ.10,000 నుంచి 11,000 వేల రూపాయలు వరకు మొత్తం రూ.11.25 లక్షలు విలువైన స్కాలర్‌షిప్ చెక్కులను శుక్రవారం విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మిట్టపల్లి రమేష్ బాబు, వైస్‌చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, డి.సునీల్, ఎస్‌వీ ఎన్.శ్రీనివాసులు, తిరుమలరావు, ఘాన్సీ, వజ్రం పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న న్యాయాధికారికి సన్మానం

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మూడు సంవత్సరాలుగా నరసరావుపేట మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారిగా సేవలందించి పిడుగురాళ్ళకు బదిలీ అయిన ప్రవళికకు శుక్రవారం న్యాయవాద సంఘ ఆధ్వర్యంలో న్యాయవాద సంఘ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో 13 అదనపు జిల్లా న్యాయ అధికారి నేతి సత్యశ్రీ, సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.మధుస్వామి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

● రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కో ఆర్డినేటర్ రాజరాజేశ్వరి

శావల్యాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పిల్లల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టిని సారించాలని రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం కో ఆర్డినేటర్ రాజరాజేశ్వరి అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు అంశాలను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి రావిపూడి రమ్య, సూపర్‌వైజర్ ఉమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియాపై ముందస్తు జాగ్రత్తలు పాటించాలి

● పీహెచ్‌సీ వైద్యాధికారి రమ్య

శావల్యాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మలేరియా జ్వరాలు రాకుండా ప్రజలంతా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి రావిపూడి రమ్య అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పీహెచ్‌సీ నుండి సెంటర్ వరకు వైద్య సిబ్బందితో కలసి శుక్రవారం ర్యాలీని నిర్వహించారు. చలిజ్వరం, ఒళ్ళునొప్పులు, తలనొప్పి వంటివి మలేరియా లక్షణాలని, కాబట్టి ఆ లక్షణాలున్న వారు వెంటనే డాక్టర్‌లను కలసి వైద్య చికిత్సలు పొందాలన్నారు. సూపర్‌వైజర్ ఉమాదేవి, ల్యాబ్ టెక్నీషియన్ సీతారామయ్య, ఎంఎల్‌హెచ్‌పీ శంకర్, ఆరోగ్య, ఆశాలు పాల్గొన్నారు.

టీడీపీ నేతపై దాడి

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐదో వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ జంగాల వెంకటేశ్వర్లుపై గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి దాడి చేసినట్లు రెండో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు మాట్లాడుతూ నిద్రపోతున్న తనపై గుర్తు తెలియని కొందరు వ్యక్తులు బీరు బాటిల్స్‌తోదాడి చేశారన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెండో పట్టణ సీఐ హైమారావు తెలిపారు.

వెనుకబడిన కులాల రైతులకు యంత్రాల పంపిణీ

వినుకొండ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎస్ఐఆర్‌సీపీ నిర్వహిస్తున్న షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల ఉపకులాలకు జీపీఏ 2024-25 సంవత్సరానికి గాను జీపీఏ పొగాకు రైతులకు వ్యవసాయ యంత్రాలను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐఆర్‌సీపీ డైరెక్టర్ డాక్టర్ ఎం.శేషుమాధవ్, డాక్టర్ వెంకటేశ్వర్లు, జీపీఏ ప్రతినిధులు పాల్గొన్నారు.